ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 26 | సంచిక : 9 & 10 | జూన్ & జూలై 2021



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 40

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి.పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342


## ఈ సంచికలో....


గురు వైభవం ........ 3

దక్షిణామూర్తి - చిన్ముద్ర ........ 8

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ........ 11

అక్షరమణమాల - ద్విపద 22 ........ 36

భగవద్గీత - శ్లోకం 2-47 ........ 38

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం




ఎక్కడ మహర్షి ఉన్నాడో, ఎక్కడైతే బ్రహ్మజ్ఞాని ఉన్నాడో. ఎక్కడైతే అవతారపురుషుడు ఉన్నాడో, ఆ పరిసరాలు ఎంతో పవిత్రము అవుతాయి. ఏ భూమి మీద అయితే ఆయన కాళ్ళు నడుస్తాయో, ఆ భూమి అంతా కూడా పవిత్రం అవుతుంది. ఏ నదిలో స్నానం చేస్తే ఆ నీరు పవిత్రం అవుతుంది. అది జ్ఞాని యొక్క వైభవం.

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# గురు పూర్ణిమ

వేదాలను విభజించి లోకానికి అందించిన మహాత్ముడు, గురుపుంగవుడు వేదవ్యాసుడు. అందుకే ఆయన పేరుమీదుగా ఆషాఢ పూర్ణిమను వ్యాసపూర్ణిమగా, గురుపూర్ణిమగా జరుపుకోవడం అనాదిగా వస్తోంది. సర్వవ్యాపక మహా వెలుతురే గురువు! అజ్ఞానమనే అంధకారాన్ని పోగొట్టి, జ్ఞానజ్యోతిని దర్శింపజేసేవాడే గురువు. సద్గురువు, తాను ఏమాత్రము తాదాత్మ్యం చెందని శరీరాన్ని, కేవలం మన కొరకు దాల్చియుంటారు. ఈ గురు, శిష్య సాంప్రదాయం చాలా ప్రాచీనమైనది. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి అవతారపురుషులకే గురువు ఉన్నారు. కలియుగంలో జన్మించి, గురుతత్త్వానికి ప్రతీకగా నిలిచిన వారు ఎందరో ఉన్నారు. మన సనాతన సంస్కృతిలో గురువుది ఒక ప్రత్యేక స్థానం. గురువును ప్రత్యక్ష దైవముగా పూజించడం మన సాంప్రదాయం. అందుకే శ్రీ యోగి వేమన "విత్తు మొదటి గురువు విశ్వంబునకు నెల్ల, ప్రణవమంత్ర మొకటే పరమ గురువు" అని గురువు యొక్క ఔన్నత్యాన్ని తెలియజేసారు. ఆ రోజున గురుపూజ చేయడం, తమ గురువును వేదవ్యాసుని రూపముగా భావించడమే! శ్రీ మహావిష్ణువే, వేదవ్యాసునిగా అవతరించాడని చెబుతారు. అందుకే ఆయన వ్యాసభగవానుడయ్యాడు. వేదవ్యాసుడు విజ్ఞానఖని, తపస్సంపన్నుడు, బ్రహ్మజ్ఞాని. వేదాలను నాలుగు భాగములుగా విభజించారు. బ్రహ్మ సూత్రాలను క్రోఢీకరించారు. వేదాంగాలను, అష్టాదశపురాణాలను, మహాభారత, భాగవతాలను, ఘనమైన వారసత్వ సంపదగా మనకు అందించారు. అట్టి వ్యాస భగవానుడు పరమ పూజనీయుడు. మన సనాతన సంస్కృతికి, వ్యాసమహర్షి చేసిన సేవ నిరుపమానం.

**(ది॥ 24-07-2021 గురుపూర్ణిమ సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# గురు వైభవం

శ్రీ నాన్నగారి భక్తులకి గురువు చేసే పని, వైభవం, గురువు యొక్క ప్రేమ అనుభవైకవేద్యం. ఎవరికి వారు ఆయన సమక్షంలో డైరెక్ట్ గా గురువు అనుగ్రహాన్ని పొందారు. గత సంవత్సరం గురుపూర్ణిమ సంచికలో గురువు చేసే పని గురించి శ్రీనాన్నగారు దయతో వివరించిన మాటలు ప్రచురితమయ్యాయి. ఈ సంచికలో గురువైభవం గురించి ఆయన స్వయముగా పలికిన కొన్ని అనుగ్రహ వాక్యాలు.........

ఈ లోకంలో ఎంతమంది మహర్షులు, మహాత్ములు ఉన్నా, వారికి ఆ శరీరంతో పని లేదు. జీవకోటి మోక్షం వైపుకు ప్రయాణం చేయటానికి సహాయసహకారములు అందించటానికే వారు ఈ లోకంలో ఉన్నారు. అంతేగాని వారికి ఇంకో పని అంటూ ఏమీ లేదు. వారు ఏ స్థితిని అయితే పొందారో ఆ స్థితికి మనం కూడా చేరుకోవటానికి తదనుగుణంగా మన చేత సాధన చేయించటానికి వారి దేహాలను ఈశ్వరుడు ఉపయోగించుకుంటాడు.

నీలో ఉన్న భగవంతుడే గురురూపం ధరించి భూమి మీదకి వస్తాడు. గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే శివుడు, దాని అర్థం బ్రహ్మ చేసే పని, విష్ణువు చేసే పని, శివుడు చేసే పని, ఒక్క గురువే చేస్తాడు. సమస్త దేవతలు చేసే పని గురువే చేసేస్తాడు. నీ లోపల ఉన్న చైతన్యమే నిజమైన గురువు. చావులేని సత్యదార్థమే గురువు. ఆ సత్యవస్తువే కాళ్ళు చేతులు తొడుక్కొని గురువుగా వస్తుంది. గురువు వేరు ఆత్మ వేరు కాదు. గురువు దేహంలో ఉన్నా, చైతన్యంతో తాదాప్యం పొంది ఉంటాడు. మనలని అనుగ్రహించటానికి రూపం ధరించిన గురువే బ్రహ్మము.

ఈశ్వరునిలో ఉన్న దయాభాగమే గురువుగా వచ్చింది. రక్షించే భాగము వచ్చింది కానీ శిక్షించే భాగం రాలేదు. భగవంతుడు మన కళ్ళకి కనిపించడు. అసలు వస్తువుకి రూపం నామం లేదు. ఆయన కృప రూపం ధరిస్తుంది.మనతో మాట్లాడటం కోసం ఆ ఎసెన్సే గురురూపం ధరించి వస్తుంది. గురువు మాట దయ, గురువు చూపు దయ, గురువు నడక దయ, అంతా దయే. మాటే కాదు, గురువు యొక్క చూపు కూడా దయ. గురువు మాట్లాడుతూ ఉంటే అక్కడ నోరు కాదు మాట్లాడేది, హృదయం మాట్లాడుతుంది. ఆ హృదయమే కాళ్ళు చేతులు తొడుక్కొని వచ్చింది.

భగవాన్ ఒకసారి తన చిన్న నాటి స్నేహితుడు రంగన్‌తో చెప్పారు - ఎక్కడ మాటలు లేవో ఎక్కడ తలంపులు లేవో ఎక్కడ సంకల్పాలు లేవో ఎక్కడ ఇష్టాయిష్టాలు లేవో ఎక్కడ భయాలు లేవో అక్కడ నేను ఉన్నాను అన్నారు. రంగన్ కి బాగా చనువు భగవాన్ దగ్గర. బాగా చనువు ఉన్నప్పుడు మినహాయింపులు ఉండవు. ఎక్కడ మాటలు లేవో అక్కడ నువ్వు ఉన్నానని చెపుతున్నావు, మరి నాతోటి నువ్వు ఎందుకు మాట్లాడుతున్నావు, అన్నాడు రంగన్. అప్పుడు భగవాన్ నీతోటి పని ఉండి మాట్లాడటంలేదు. నీతో మాట్లాడటానికి నాకేమీ పని లేదు. కేవలము దయ, కేవలము ప్రేమ అన్నారు.

గురువు భక్తుడి తోటి మాట్లాడేటప్పుడు అనుగ్రహించటానికే మాట్లాడతాడు. ఔట్ ఆఫ్ లవ్ ఔట్ ఆఫ్ కంపాషన్ ఔట్ ఆఫ్ మెర్సి, అంతే కానీ పని ఉండి మాట్లాడటం కాదు, దయ వల్ల మాట్లాడతాడు. గురువు దయాస్వరూపుడు.  ఆయన మాటలోనే జ్ఞానం ఉంది. ఆ మాటలోనే ప్రేమ ఉంది, ఆ మాటలోనే చైతన్యం ఉంది అని గ్రహించినవాడు ధన్యుడు.

గురువు ఎదురుగా ఉన్నప్పటికీ, ఆ వైభవం గురించి ఆయనే చెపుతున్నప్పటికీ మనకు లోపల యోగ్యత లేకపోతే కళ్ళు ఉండి చూడలేరు, చెవులు ఉండి వినలేరు, బుద్ధిలో పక్వత లేకపోతే అర్థం చేసుకోలేరు. భగవంతుడే ఎదురుగా ఉన్నా కృష్ణ పరమాత్మని కౌరవులు గుర్తించలేదు. అది గుర్తించటానికి నీకు తగిన యోగ్యత ఉండాలి. గురువు యొక్క వైభవాన్ని గ్రహించలేకపోతున్నాము, దైవము యొక్క శక్తిని గుర్తించలేకపోతున్నాము అనే తపన కలిగినప్పుడు ఆ గ్రహించే శక్తిని ఆయనే అనుగ్రహిస్తాడు. భక్తి లేకుండా శక్తి రాదు. భక్తి లేకుండా జ్ఞానం రాదు. ఈశ్వరుడి పట్ల భక్తి లేదని తపిస్తూ ఉంటే, ఆ భక్తి కలిగేటట్లు గురువే, ఆ ఈశ్వరుడే, అనుగ్రహిస్తాడు.

నీలో బలహీనతలు ఉన్నంతకాలం, గురువు యొక్క సహాయం నీకు అవసరమే. ఎందుచేతంటే గురువు యొక్క సహాయం లేకుండా ఆ బలహీనతల నుండి నీవు విడుదల పొందలేవు. ఎంత పెద్ద గడ్డిమేటు అయినా ఒక అగ్గిపుల్లకి లోకువ, ఎంత పెద్ద గుమ్మడికాయ అయినా ఒక చిన్న కత్తిపీటకి లోకువ, అలా గురువు అనుగ్రహం ముందు, నీలో పెద్ద బండరాళ్ళ లాంటి వాసనలు ఉన్నప్పటికీ అవన్నీ బయటికి లాగి తీసేస్తాడు. నీ లోపల ఉన్న సుఖసముద్రంలో ఈదులాడే లాగ నీకు సహాయ సహకారములు అందిస్తాడు,

ఏవో కోరికలు నెరవేరటం కోసం మనం భగవంతుడిని ప్రార్థిస్తూ ఉంటాము. అది

కూడా భక్తే. కాని భక్తులలో సత్యాన్వేషకులు కొంతమందే ఉంటారు. నువ్వు సత్యానుభవం పొందాలి సత్యసాక్షాత్కారం పొందాలి అనుకున్నంత కాలం నీకు గురువు యొక్క అవసరం ఉంది. నీలో సత్యముగా ఉన్నవాడు గురువే.

మొదటలో గురువు వేరు, నేను వేరు అని నీవు అనుకోవచ్చు. ఆ ద్వయీభావనతో నువ్వు పూజించటం ప్రారంభిస్తావు. గురువు అది చూస్తూ ఉంటాడు. ఆ బేధబుద్ధిని పోగొట్టటానికి నీతో మాట్లాడుతూ ఉంటాడు, నీతో తిరుగుతూ ఉంటాడు, నీతో అన్నం తింటాడు, మంచి నీళ్ళు త్రాగుతాడు. నీతో ప్రయాణం చేస్తాడు. ఈ మాటలు ఈ రచనలు ఈ ప్రసంగాలు, ఈ ప్రవచనాలు అన్నీ కూడా చెపుతూ ఉంటాడు. బేధబుద్ధిలో నుంచి నిన్ను విడుదల చేసి అభేదబుద్ధిని అనుగ్రహించే వరకూ నిన్ను విడిచిపెట్టడు, అద్వైతానుభవం అద్వైతసుఖం అనుభవంలోకి వచ్చేవరకు మిమ్మల్ని బేధబుద్ధి విడిచిపెట్టదు, దుఖం విడిచిపెట్టదు. జన్మలు వెంటాడుతూ ఉంటాయి.గురువు అనుగ్రహం లేకుండా నువ్వు సత్యసాక్షాత్కారం అమృతానుభవం పొందలేవు, పునర్జన్మల లోనుంచి విడుదల పొందలేవు.

మీ దయ నా మీద ఉంటుందా అని ఒక భక్తుడు అడిగితే, భగవాన్ వండర్ఫుల్‌గా చెప్పారు. అగ్ని వేడి లేకుండా ఉండదు. అలాగే గురువు దయ లేకుండా ఉండడు. గురువు యొక్క దయ ఎప్పుడూ ఉండనే ఉంటుంది. గురువు అనుగ్రహం లేదు అనుకున్నప్పుడు ఉంది, ఉందనుకున్నప్పుడు ఉంది. అనుగ్రహాన్ని గ్రహించే శక్తి నీకు ఉంటే అది తెలుస్తుంది. ఆ దయను గ్రహించేబుద్ధి నీకు కలగాలి. ఆ గ్రహించే బుద్ధి నీకు ఉందో లేదో, దానికి తగిన యోగ్యత ఉందో లేదో, అది చూసుకో, అంతేగాని గురువు దయ ఉందా లేదా అని కాదు.

గురువు యొక్క దయ నీకు ఎలా తెలుస్తుంది అంటే, గురువు మీద భక్తి వలన, విశ్వాసం వలన తెలుస్తుంది. నువ్వు విశ్వాస హీనుడవు అవ్వవద్దు. గురువు పట్ల ప్రపత్తిలో గురువుకి శరణాగతి చెయ్యటంలో అది నీకు తెలియబడుతుంది. నీ బుద్ధిలో దోషం, నీ బుద్ధికి వాండరింగ్ ఉంటే అనుగ్రహం నువ్వు గుర్తించలేకపోవచ్చు. గుర్తించలేనంత మాత్రం చేత అనుగ్రహం లేదని నువ్వు అనుకోవద్దు.

అందరి శిరస్సు మీద ఆయన దయ ఉంది. మనకు పుణ్యబలం ఉంటే ఆయన దయ మన మీద ఉన్నట్లు మనకు తెలుస్తుంది. అనేక జన్మలు సాధన చేస్తేగాని, అనేక జన్మలలో మనం పుణ్యం సంపాదిస్తేనే కానీ, మంచి కర్మలు చేసుకొంటూ వస్తేనే కానీ

అసలు మన ముఖం భగవంతుడి వైపుకి తిరగదు. మృత్యువు లోనుంచి విడుదల పొందాలనే తలంపు కూడా రాదు  అని పరమాత్మ చెప్పాడు.

గురువును ఆశ్రయించు, గురువును విడవకుండా పట్టుకో, ఆయన చెప్పినది శ్రవణం చెయ్యి, వారికి సేవ చెయ్యి. గురువుకు సేవ చేసేకొలదీ, ఆయన మాటలు శ్రవణం చేసేకొలది, ఏ కారణం వలన ఈ జన్మలోనికి వచ్చాము, ఏ కారణం వలన మనకు ఈ దుఖం కలుగుతోంది, ఆ కారణాలు తెలుస్తాయి. దుఖానికి బంధానికి కారణం నీకు తెలియచేసి ఆ కారణాన్ని కత్తిరిస్తాడు, ఆ కారణంలోనుంచి విడుదల చేస్తాడు. అప్పుడు నీకు దుఖం తోటి, జన్మతోటి ఉన్న సంబంధం ఊడిపోతుంది. అలా ఊడిపోయేలాగ అనుగ్రహించేవాడే గురువు.

ఉన్న సత్యం నీకు ఎరుకపరుస్తాడు, దానిని స్మరించేటట్లు చేస్తాడు, దాని గురించి తపించేటట్లు చేస్తాడు. అది తప్పించి ఏదీ లేదని నీకు అనుభవం లోకి కూడా తీసుకొస్తాడు. బ్రహ్మం తప్పించి ఇంక ఏదీ లేదని నీకు తెలిసేవరకూ, బ్రహ్మానుభవం నీకు కలిగేవరకూ గురువు నిన్ను వెంటాడుతూ ఉంటాడు. నీ లోపల ఉన్న బ్రహ్మం నీకు అనుభవంలోనికి వచ్చాక గురువు ఎక్కడో ఉన్నాడు, వైకుంఠంలోనో కైలాసం లోనో ఉన్నాడు, అనుకొన్నాను ఇక్కడే ఉన్నాడు అని నీకు అనుభవంలోకి వస్తుంది. ఇదంతా గురువు దయ వలననే జరిగిపోతూ ఉంటుంది.

భగవంతుని పట్ల నీవు ఏదైనా అపచారం చేస్తే ఆ అపచారం యొక్క ప్రభావం నీ మీద పడకుండా గురువు నిన్ను సరిదిద్దుతాడు. నువ్వు సంవత్సరాలు తరబడి అనుభవించ వలసినది కొన్ని క్షణాలలో అనుభవింప చేసి నిన్ను ఆ అపచారం లోనుంచి విడుదల చేస్తాడు. ఒకవేళ గురువు పట్ల మీరు అపచారం చేస్తే, భగవంతుడు సరిదిద్దలేడని కొంతమంది మహాత్ములు చెపుతున్నారు అని భగవాన్ అంటున్నారు. గురువు యొక్క వైభవం తెలియటం కోసం ఈ మాటలు చెపుతున్నారు.

మీకు ఎప్పుడైనా అశాంతి కలుగుతూ ఉంటుంది. ఏమిటి ఇంత అశాంతిలో నేను ఉన్నప్పుడు గురువు నా చెయ్యి విడిచిపెట్టేసి ఎక్కడికో పోయాడు అని నీకు అనిపిస్తుంది. ఆయన అనుగ్రహమే మన చేత అలా అనిపింప చేస్తుంది. నీలో ఎంత అశాంతి ఉందో, అది ఎంత బలంగా ఉందో, నీకు తెలియ చేస్తాడు. అశాంతి లోనుండి, దుఖబంధం లోనుండి నిన్ను విడుదల చేయటానికి ఆ ప్రక్రియలు అన్నీ చూపిస్తూ అందులోనుండి విడుదలయ్యే శక్తిని, భక్తిని నీకు ప్రసాదించి, అందులోనుండి నిన్ను విడుదల చేస్తాడు. వాడు గురువు!

ఆ భక్తి భావనను ఇచ్చేవాడు గురువే, అజ్ఞానాన్ని తొలిగించుకోవాలి అనే బుద్ధిని ఇచ్చేవాడు గురువే. అజ్ఞానంలోనుండి విడుదల చేసేవాడు గురువే. నీకు బ్రహ్మనిష్ట కలగచేసేవాడు గురువే. అన్నీ గురువే! దేహబుద్ధి ఉన్నప్పుడు సంతోషం వెంటాడుతుంది, దుఖం వెంటాడుతుంది. దేహాభిమానం లేనివాడికి ప్లెజర్ లేదు పెయిన్ లేదు. ఆ దేహాభిమానం లోనుండి విడుదల అవ్వాలనే ఆసక్తి కలుగజేసేవాడు, దేహాభిమానం లోనుండి మిమ్మల్ని విడుదల చేసేవాడు గురువే. ఇది తెలిసినవారు ధన్యులు, ఆదృష్టవంతులు.

గురువు ఓర్పుగా, శాంతిగా ఉంటాడు. గురువు యొక్క ఓర్పుకు హద్దులు ఉండవు. సూదంటురాయి ఇనుమును ఆకర్షించినట్లు తనమాటతో, తన చూపుతో భక్తుడిని ఆకర్షించుకుంటాడు. ఆకర్షించుకోవటమే కాదు తన స్వరూపాన్ని ఇస్తాడు. అప్పటివరకూ గురువు అంతటి వాడు, గురువు ఇంతటి వాడు, అని నోటితో చెప్పినా, నీ మనస్సుతో ఊహించినా గురువు యొక్క ఔన్నత్యాన్ని నీవు గుర్తించలేవు. నీ స్వరూపం నీకు తెలిసాక గురువు యొక్క ఔన్నత్యం నీకు తెలుస్తుంది. అన్ని జీవరాసులలో నీ గురువునే చూడటం నేర్చుకొనే పరిస్థితిని కల్పిస్తాడు. అప్పుడు నీకు ఎటు చూసినా గురువే కనిపిస్తాడు. అలా నిన్ను అనుగ్రహిస్తాడు.

ఈ లోకంలో ఎంతోమంది మహర్షులు, మహనీయులు, జ్ఞానులు ఉన్నారు. నీ మనస్సు ఎవరితో శృతి కలుపుతోందో, ఎవరిమీద నీకు భక్తి విశ్వాసం కుదురుతోందో, ఎవరిని చూస్తూవుంటే నీ లోపల ఉన్న ఆనందం నీకు ఎరుకలోనికి వస్తోందో, వారినే నీ గురువుగా తీసుకో. కాని మోక్షం పొందాలి అనే తపన, ఆ ముముక్షత్వం, మహాపురుషులతో సహవాసం చేయాలనే తపన ఇదంతా లోపలినుండి వస్తుంది కాని బయటనుండి వచ్చేది కాదు. నీ జిజ్ఞాస నిజమైతే, తగిన అర్హత నీకు వస్తే నీ లోపలనుండే గైడెన్స్ ఇచ్చి, జీవలక్షణాలను తొలిగించి, చైతన్య స్రవంతి లో నిన్ను కలిపేస్తాడు. నీ నామబుద్ధి నుండి, రూపబుద్ధి నుండి విడుదల చేసి నిన్ను మోక్ష సామ్రాజ్యానికి అధిపతిని చేస్తాడు.

మనకి దాహం తీర్చటానికి ఎవరైనా మంచినీళ్లు ఇస్తే, ఆకలి వేస్తే ఎవరైనా అన్నం పెడితే మనము ఎంతో కృతజ్ఞత చూపిస్తాము, మన చీకటిని అజ్ఞానాన్ని తొలిగించేవాడికి బంధం లోనుంచి విడుదల చేసేవాడికి ఎంత కృతజ్ఞత చూపించాలి! మనని దయతో అనుగ్రహించే గురువుని పూజించక పోతే వాడికి నమస్కరించక పోతే వాడిని ధ్యానం చేయకపోతే ఎవడిని పూజించాలి, ఎవడికి నమస్కరించాలి. ఎవడి గురించి ధ్యానం చెయ్యాలి!

# దక్షిణామూర్తి - చిన్ముద్ర



శివుని అవతారములలో మొదటిది దక్షిణామూర్తి. శంకరులే కృతయుగంలో దక్షిణామూర్తిగా మౌనంతో బోధించారు. దీని తరువాత శివుడి అవతారం ఆచార్యులు వారు. ఆయన మాటల ద్వారా రచనల ద్వారా బోధించారు. సామాన్య మానవులకు అర్థం అయ్యేలా సరళంగా బోధించారు. తరువాత రమణావతారం. ఈయన దక్షిణామూర్తి భాగం కొంత, ఆచార్యుల వారి భాగం కొంత తీసుకున్నారు. మౌనం ద్వారా చెపితే ఆ వ్యక్తికి అర్థం అవుతుంది అంటే మౌనంగా బోధించేవారు, లేకపోతే మాటలు చెప్పేవారు. అక్కడ మౌనం మాట అనేది ప్రధానం కాదు, మనోవికాసం కలగటం ప్రధానం.

పరబ్రహ్మ స్వరూపాన్ని మాటలతో చెప్పటం జ్ఞానికి కూడా సాధ్యం కాదు. ఆదిగురువు అయిన దక్షిణామూర్తి కూడా పరబ్రహ్మ స్వరూపాన్ని మాటలతో చెప్పలేక మౌనంతోటే చెప్పారు. శివుడు దక్షిణామూర్తి అవతారం ఎత్తినప్పుడు మాటలతో చెప్పటం నాకే సాధ్యం కాదు అని చెప్పి ఆయన మౌనం వహిస్తే, మనకేలా సాధ్యం అవుతుంది మాటలతో చెప్పటం!

దక్షిణామూర్తి అంటే దక్షిణ-అమూర్తి. ఆయనకి మూర్తి లేదు, రూపం లేదు. మన హృదయంలో దక్షిణం వైపు అంటే, స్పిరిట్యువల్ హార్ట్ లో ఉంటాడు. నేను చెపుతున్నాను, నా మాట విను అని లోపలినుంచి మన హృదయవాణి అంటుంది. అంటే దక్షిణామూర్తి అక్కడ ఉన్నాడు అన్నమాట. మన హృదయంలో దక్షిణం వైపు అమూర్తిగా ఉన్నాడు. ఈశ్వరుడే రూపం లేకుండా ఇక్కడ (మీ హృదయములో కుడివైపు) దాక్కుని ఉన్నాడు అన్నమాట. అందుకే మీ చెయ్యి అక్కడ పడుతుంది. రూపం ఉంటే మనం పట్టేద్దుము. ఎందుకంటే, రూపదృష్టికి అలవాటు పడి ఉన్నాము కాబట్టి. మనం చెయ్యి (గుండెలపైన కుడివైపు) ఎందుకు వేస్తామో మనకు తెలియదు. అక్కడ దేవుడు ఉన్నాడు అని మనకి తెలియదు. అయితే

దేవుడు ఉన్నాడు అనే వాడు ఇక్కడే చెయ్యి వేస్తాడు. దేవుడు లేడు అని చెప్పేవాడికి కూడా చెయ్యి ఇక్కడికే వెళ్తుంది. అంటే దేవుడు అక్కడ ఉన్నాడు కాబట్టి! ఇది మీకు అనుభవంలో లేదా? మీరు ఎవరైనా కాదు అనగలరా ఈ అనుభవాన్ని!

సనత్కుమార సనాత్సుజాతులు నలుగురూ ఉపనిషత్తు ఋషులు, గొప్ప వైరాగ్య పురుషులు. వాళ్ళు దక్షిణామూర్తి శిష్యులు. వాళ్ళకి పెళ్లి సంసారం అంటే ఇష్టం ఉండదు. పెళ్లిళ్లు అయిన వాళ్ళతో మాట్లాడరు, సంసారులకి దూరంగా ఉంటారు. వాళ్ళలో సనత్కుమారుడు అంటే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆయనే తరువాత రమణస్వామి.

వాళ్ళు నలుగురూ ముందు బ్రహ్మదేవుడి దగ్గరికి వెళ్లారు. ఆయన పక్కన సరస్వతి ఉందని వాళ్ళకి నచ్చలేదు. మనని బాగుచేయ్యటానికి పనికి రాడు అని వదిలేశారు. మహా విష్ణువు దగ్గరికి వెళ్ళి ఆయన కూడా పనికిరాడని వదిలేశారు. తరువాత శివుడి దగ్గరికి వెళ్ళారు. శివుడి పక్కన పార్వతి ఉంది. పార్వతిని చూసేటప్పటికి కోపం వచ్చేసింది వాళ్ళకి. ఈయన కూడా పనికి రాడు మనని బాగుచేయ్యటానికి అని శివుడిని కూడా వదిలేసి వెళ్లిపోతున్నారు. అప్పుడు శివుడికి వీళ్ళని చూసి జాలి కలిగింది, తప్పుగా అర్థం చేసుకొంటున్నారు అని. వాళ్ళు వెళ్ళే దారిలో ఒక వటవృక్షం క్రింద చిన్ముద్రలో దక్షిణామూర్తి గా కూర్చుంటాడు. శివుడే ఈ వేషంలో కూర్చుంటాడు.

దక్షిణామూర్తి అంటే శివుడే. పార్వతి లేకుండా ఆయన ఒక్కడే వటవృక్షం కింద చిన్ముద్రలో మౌనంగా కూర్చున్నాడు. వాళ్ళు కూడా అలా మౌనంగా ఆయన ముందు కూర్చున్నారు, కానీ ఆశ్చర్యం ఏమిటంటే సనత్కుమారుడికి సనత్సుజాతులకి ఎన్ని సందేహాలు ఉన్నాయో, అన్ని సందేహాలు కాలి బూడిద అయిపోయాయి, అది ఒక విధమైన లాంగ్వేజ్.

దక్షిణామూర్తి చిన్ముద్రలో కూర్చుంటాడు. చిన్ముద్ర అంటే: జీవుడు పరమాత్మతో ఐక్యమయ్యి పరమాత్మ స్వరూపం పొందటం. చిన్ముద్రలో బొటన వేలు పరమాత్మకు, చూపుడు వేలు జీవుడికి ప్రతిరూపం. చూపుడు వేలు బొటన వేలు కలిసినప్పుడు, జీవుడు పరమాత్మలో ఐక్యం అయ్యి, జీవుడు పరమాత్మ స్వరూపం పొందుతాడు. ఎందుకు ఐక్యమయ్యాడు, ఎలా ఐక్యం అవ్వగలిగాడు? అది ఎలా సాధ్యం అంటే, మిగతా మూడు వేళ్ళకు ప్రతినిధి అయిన అహంకారం, స్వార్థం (సకామ కర్మ చేసేవారు), మాయ (లేనిది ఉన్నట్లుగా కనిపించడం), ఈ మూడు త్యజించినప్పుడే, జీవుడు పరమాత్మలో ఐక్యమవుతాడు.

ఈ మూడు వేళ్లలో ఒకటి అహంకారం, రెండు స్వార్థం. అహంకారం లేకపోయినా స్వార్థం ఉంటుంది కొంతమందికి. వాళ్ల స్వార్థం ఏదో వాళ్ళు చూసుకుంటారు కానీ వాళ్లకి అహంకారం ఉండదు. పైగా ఇంకోటి చెపుతారు వాళ్ళు, మీరు నన్ను నాలుగు తిట్టినా పరవాలేదు, ఒక వందరూపాయలు పడేసి వెళ్లిపోండి అంటారు. వాళ్ల స్వార్థం వాళ్ళు చూసుకుంటారు కానీ, మంచి వాళ్ళే. అంటే వాళ్ల దగ్గర దుర్మార్గం ఉండదు, క్రూరత్వం ఉండదు. అహంకారంగా ఉండరు. ఎవరికీ ఏమీ ఇవ్వరు, కాని ఎదుటివాళ్లకి చెడ్డ చెయ్యరు. వాళ్ల జాగ్రత్తలో వాళ్ళు ఉంటారు. ఏ పని చేసినా వాడికి కలిసి వస్తుంది అంటే చేస్తాడు, లేకపోతే చెయ్యడు. అంటే సకామ కర్మ చేసేవాడు నిష్కామ కర్మ చెయ్యడు, కలిసివస్తే చేస్తాడు, లేకపోతే లేదు - అది స్వార్థం. దానిలో తప్పేమీ లేదు, అయితే వాళ్ళు సెల్ఫ్ సెంటర్డ్! నేను (నాన్నగారు) చెప్పానని నమ్మకండి, మీరు కూడా అలా లోకాన్ని చూస్తూ ఉండండి.

మూడోది మాయ. మాయ అంటే సత్యాన్ని అసత్యం అనుకుంటాడు, అసత్యాన్ని సత్యం అనుకుంటాడు. నిజాన్ని అబద్ధం అనుకుంటాడు, అబద్ధాన్ని నిజం అనుకుంటాడు. దీనిని గీతలో వండర్ఫుల్ గా చెపుతాడు - ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు. ఇక్కడ మాయ అంటే ఏమిటంటే, ఉన్నదానిని లేదు అనుకోవటం, లేనిదానిని ఉంది అనుకోవటం. లేనిది నువ్వు ఉంది అనుకున్నప్పుడు కూడా ఉండదు. ఉన్నదానిని లేదు లేదు అనుకున్నప్పుడు అది కూడా ఉండకుండా పోలేదు. ఇప్పుడు మనం శరీరం నిజం అనుకొంటున్నాము, చైతన్యము అబద్ధం అనుకొంటున్నాము, అదే మాయ అంటే. భగవాన్ దీనిని అద్భుతంగా చెప్పారు. దేవుడు లేడు అనేవాడు నిజంగా లేడు కానీ దేవుడు ఉన్నాడు, అన్నారు. ఏమి గొప్ప లాజిక్ చూడండి. లాజిక్ అనేది మన మనస్సు చల్లబడటం కోసం, మన హృదయాలు చల్లబడటం కోసం పుట్టిన శాస్త్రం, అంతే కానీ మన బుర్రను వేడి ఎక్కించటం కోసం పుట్టిన శాస్త్రం కాదు.

ఇంతకీ జీవుడు పరమాత్మ స్వరూపం ఎలా అవుతాడు అంటే, అహంకారం, స్వార్థమే పరమార్థం అనుకుని ఇరువై నాలుగు గంటలూ సకామ కర్మే చేసేవాడు, మాయ, ఈ మూడింటినీ ఏ జీవుడు అయితే విడిచిపెట్టేస్తాడో, వాడు పరమాత్మ స్వరూపం పొందుతాడు. ఈ మూడింటినీ ఎవడైతే విడిచి పెట్టలేడో ఆ జీవుడు పరమాత్మని పొందలేడు. అది దక్షిణా మూర్తి యొక్క చిన్ముద్ర.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు – 15 మార్చి 1987, చింతపర్రు


ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఓం అంటే పరబ్రహ్మ యొక్క పేరు ఓంకారం. పరబ్రహ్మనే వేరే శబ్దంతో చెప్పాలంటే ఓంకారం. మీరు భక్తి శ్రద్ధలతోటి ఈ ఓంకారాన్ని ధ్యానం చేస్తే, మననం చేస్తే జ్ఞానం కలుగుతుంది. ఓంకారం అనేది మన నిజమైన ఇల్లు. మన ఇల్లు ఏమిటంటే, ఆ ఇంటికి చేరేవరకు మనం శరీరాలు మారుస్తూ ఉండాలి. నిజమైన ఇల్లు ఓంకారం. అదే మన స్వరూపం. స్వరూపం ఎక్కడో లేదు మనకి, ఇక్కడే ఉంది. ఇప్పుడు మనం స్వరూపంగానే ఉన్నాం. పూర్వం కంటే ఇప్పుడు ఎన్నో సదుపాయాలు వచ్చాయి, రోడ్లు వచ్చాయి, రైళ్ళు వచ్చాయి, కార్లు వచ్చాయి. ఎన్నో సదుపాయాలు వచ్చాయి, కాని మీకు పూర్వం ఉన్న బాధ, పూర్వం ఉన్న దుఃఖం అప్పుడూ ఉంది, ఇప్పుడూ ఉంది. ఎందుచేత అది తగ్గటం లేదు? లోకంలోకి అనేకమంది గురువులు వచ్చారు కదా, అనేకమంది అవతార పురుషులు వచ్చారు కదా, ఎంతో కష్టపడి బోధించి, బోధించి వెళ్ళిపోయారు కదా, మనకి ఏమైనా దుఃఖం తగ్గిందా, బాధ తగ్గిందా? నాకేమి బాధ లేదు, నాకేమి దుఃఖం లేదు అని ఎవరైనా చెప్పటానికిసిద్ధంగా ఉన్నారా ఇక్కడ. పూర్వం కంటే రూపాయలు ఎక్కువ ఉన్నాయి ఇప్పుడు. అన్ని రకాలుగా పూర్వం కంటే ఎక్కువ సదుపాయాలు ఉన్నా కూడా ఈ బాధ, దుఃఖం మనల్ని వెంటాడుతునే ఉన్నాయి. ఎందుచేత బాధ ఉంది మనకి, దుఃఖం ఉంది. ఒక్క విషయం మీరు జ్ఞాపకం పెట్టుకోండి. మన లోపల అజ్ఞానం ఉన్నంత కాలం, మన లోపల అవిద్య ఉన్నంతకాలం ఎవరు మన దుఃఖాన్ని తీసేయలేరు. ఎవరు మన బాధని తీసేయలేరు. మీకు ఎంత డబ్బు ఉండనివ్వండి, ఎంత అధికారం ఉండనివ్వండి. తాత్కాలికంగా మీకు ఎప్పుడైనా సంతోషం వస్తే రావచ్చు. లోపల అజ్ఞానం పేరుకున్నంత కాలం, లోపల అవిద్య పేరుకున్నంత కాలం దుఃఖం వెంటాడుతూనే ఉంటుంది. బాధ వెంటాడుతూనే ఉంటుంది. నాలో ఉన్న అజ్ఞానాన్ని ఎవరైతే తొలగించడానికి సహాయం చేస్తున్నారో, నాలో ఉన్న అజ్ఞానానికి ఎవరైతే విరోధో, నాలో ఉన్న అవిద్యని ఎవరైతే తొలగించడానికి సహాయం చేస్తున్నారో, అతనే గురువు. గురువు అంటే ఏమిటి అండి. మీ చేత దండలు వేయించుకోవడానికి లేకపోతే మీతో సన్మానాలు

చేయించుకోవడానికి గురువా? ఎవరైతే మన లోపల ఉన్న అజ్ఞానాన్ని పోవటం కోసం సహాయం చేస్తున్నారో, ఎవరైతే మన లోపల ఉన్న అవిద్యని బయటకు పోవడం కోసం సహాయం చేస్తున్నారో, ఎవరైతే మనలో ఉన్న అజ్ఞానానికి కోత పెడుతున్నారో, మన అవిద్యని మన చేతికి పట్టిచ్చి ఇది అవిద్య, ఇది అజ్ఞానం, అది ఇలా ఉంటుంది అని చెప్పి దానిని తొలగించడానికి ఎవరైతే మనకి నిండు మనసుతోటి సహాయ సహకారాలు అందిస్తున్నారో అతనే గురువు. గురువు అనేవాడు మనకి ఉన్న అజ్ఞానాన్ని తొలగించుకోడానికి మనకి సహాయం చెయ్యకపోతే వాడు గురువే కాదు.

మీరు ఎంతో కాలం నుంచి మననం చేస్తున్నారు. శాస్త్రాలు శ్రవణం చేస్తున్నారు. మీకు ఎంతవరకు దుఃఖం తగ్గింది, బాధ తగ్గింది. అర్జునుడు భగవద్గీత విన్నాడు, విన్న తర్వాత నా మోహం పోయింది అన్నాడు. మనం భగవద్గీత చదువుతున్నాం. మోహం ఎవరికైనా పోయిందా. ఈ మోహం ఎంతకాలం అయితే పోదో, అంతకాలం మనం చీకట్లో ఉండవలసిందే. భోజనం చేసేటప్పుడు గోవిందా, గోవిందా అంటాం. మంచిదే, తిరుపతి మెట్లు ఎక్కేటప్పుడు కూడా చూడండి కొంతమంది గోవిందా, గోవిందా అంటారు. గోవిందా అంటే ఏమిటి? పరమాత్మ. గోవులు అంటే వాక్యాలు. అంటే వేదాలలో,మన భగవద్గీతలో చెప్పినటువంటి ఆ వాక్యాలు. ఆ అర్థం ఎవరైతే హృదయానికి పట్టించుకున్నారో వాడికి గోవిందుడు తెలుస్తాడు. విభూతి యోగంలో రాముడిని ధ్యానం చెయ్యమని, కృష్ణుడిని ధ్యానం చెయ్యమని, శంకరుడిని ధ్యానం చెయ్యమని ఇలా కొన్ని ఉపాసనలు పరమాత్మ చెప్పాడు. మనం ఆత్మని ధ్యానం చెయ్యలేము కాబట్టి అవి చెప్పాడు. మనం సరాసరిగా కనుక ఆత్మని ధ్యానం చెయ్యగలిగితే బయట రూపాన్ని ధ్యానం చెయ్యవలసిన పని లేదు.

**గురువుకి శరీరం తోటి పని లేదు, ఒకవేళ శరీరం ఉన్నా ఆయన శరీరరహితుడే, ఆయనకి రూపం అక్కరలేదు, కానీ నీకు రూపదృష్టి ఉంది కాబట్టి నీకు కళ్ళకి కనిపించటం కోసం ఒక రూపాన్ని ధరించి వస్తాడు.**



మనకి ఆత్మ ధ్యానం చేతకాదు కాబట్టి, దానిని అందుకోలేక పోతున్నాం కాబట్టి, ఆత్మని సరాసరిగా మనం తెలుసుకోలేక పోతున్నాం కాబట్టి ఆయన విభూతులు చెప్పాడు. ఎప్పటికైనా ఈ జన్మలో అయినా, మరొక జన్మలో అయినా, ఆత్మని ధ్యానం చేస్తే కాని ఆత్మ గురించి తెలియదు. దానిని ధ్యానం చేస్తేనే కాని అది తెలియదు. నిజమైన గోవిందుడు ఎవరు? మన ఆత్మగానే ఉన్నాడు. దానిని తెలుసుకునే వరకు మనకు ఈ ప్రయాణం ఆగదు. అయితే ఈ ప్రయాణం చేసేటప్పుడు ఏమన్నారు అంటే తక్కువ సామాను వేసుకుని వెళ్ళమన్నారు. ప్రయాణం చేయటం ఎలాగా తప్పదు. Less luggage, More comfort. తక్కువ సామానుతోటి ప్రయాణం చెయ్యండి, ఎక్కువ సుఖంగా వెళ్ళచ్చు. అంటే ఏమిటి మనకి మరణం వచ్చే లోపులో మనకున్న కోరికలని, మనకున్న సంస్కారాలని, మనకున్న వాసనలని ఆ లగేజ్ తగ్గించేయమంటున్నాడు. కాని మనం మరణించే లోపులో ఈ సామాన్లు ఎక్కువ పోగు చేసుకుంటున్నాం. మొత్తానికి ఎలా అయినా మీరు లగేజ్ లేకుండా ఉండలేరు. సాధ్యమైనంత వరకు తక్కువ చేయండి ప్రాణం పోయే టైముకి లగేజ్ చాలా తక్కువ చేసుకోండి. లగేజ్ కనుక తక్కువ చేసుకుంటే వచ్చే జన్మలో మీకు ధ్యానం బాగా కుదురుతుంది. స్మరణ బాగా కుదురుతుంది. చాలామంది ఏమంటారు మేము ధ్యానంలో కూర్చొంటున్నాం అండి కుదురు ఉండటం లేదండి అంటారు. మన ఇష్టమా ధ్యానం చెయ్యటం? లోపల ఉన్న వాసనలు అన్నీ కూడా వచ్చి ధ్యానం చెయ్యనిస్తాయా? మనకున్న తలంపులు మనలని ధ్యానం చెయ్యనిస్తాయా? ధ్యానం చెయ్యనివ్వవు.

మనం ధ్యానానికి కూర్చుంటే ఒక్కొక్క కోరిక జ్ఞాపకం వస్తాయి. నా మాట ఏమి చేసావు అంటాయి. ఒక తలంపు వస్తుంది, నన్ను ఎప్పుడు satisfy చేస్తావు అంటుంది. ఒక్క మాట మీకు జ్ఞాపకం ఉంచుకోండి, లోపల వాసన ఉన్నంతసేపు తలంపుని ఎవరు ఆపు చేయలేరు. మీ గురువు ఎవరైనా సరే లోపల వాసన ఉన్నంతసేపు తలంపుని ఎవరు ఆపు చేయలేరు. వాసనని బట్టి తలంపు పుడుతుంది. తలంపుని బట్టి మాట వస్తుంది. మాటని బట్టి పని చేస్తాం, మన స్వార్ధంతోనే పనిచేస్తాం కాబట్టి మళ్ళీ సంస్కారం పుడుతుంది. ఆ సంస్కారం మళ్ళీ వాసనగా హృదయంలోకి వెళ్ళిపోతుంది. అంటే వాసన లోంచి తలంపు వస్తుంది. వాసనని జయించకుండా మనసుని ఎవడు జయించలేడు. మలిన వాసనలు క్షుద్ర జన్మలు తీసుకు వస్తాయి, ఉత్తమ వాసనలు ఉత్తమ జన్మలు తీసుకు వస్తాయి. మలిన

వాసనలు తొలగించు కోవడం కోసమే ఉత్తమ వాసనలు ప్రవేశ పెట్టాలి. తరువాత ఉత్తమ వాసనలు కూడా వాటంతట అవే రాలిపోతాయి. అందుచేత మన ప్రాణ ప్రయాణ టైము వచ్చేటప్పటికి లోపల ఉన్నటువంటి వాంఛలని, ప్రకృతికి సంబంధించిన విషయాలని, సాధ్యమైనంత వరకు తగ్గించుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి. అదే సాధన.

నిన్న ఎవరో అడిగారు ఏవండీ అజ్ఞానం ఎలా ఉంటుంది అని,ఎలా ఉంటుందో మీరు ఎప్పుడైనా చూశారా, రాముడిని చూశారు. మీ కలలో కూడా కనిపిస్తూ ఉంటాడు కదా రాముడు. అజ్ఞానం ఎలా ఉంటుందండి అని అడిగారు నన్ను ప్రశ్న. ఏమని చెప్పాలి? అది ఎలా ఉంటుందో తెలియాలి కదా పోగొట్టుకోవడానికి అసలు,ముందు రోగం తెలిస్తే దానికి మందు వాడచ్చు. సాధారణంగా ఈ రోగానికి ఈ మందు పుచ్చుకుంటే పోతుంది అని, వారు అడిగిన ప్రశ్న ఏమిటి అంటే అజ్ఞానం ఎలా ఉంటుంది అని. మైక్రో స్కోప్ పెట్టి చూస్తే కనిపిస్తుందా? మీరు ఎవరైనా చూశారా అజ్ఞానాన్ని. ఏమి లేదు. అజ్ఞానం అంటే నాలో ఉన్న పరమాత్మని నేను తెలుసుకోలేక పోవటమే అజ్ఞానం. అంటే మనం అందరం అజ్ఞానంలో ఉన్నట్టే గుర్తు. అజ్ఞానం అంటే అదొక పదార్థం కాదు. ఒక భౌతిక వస్తువు కాదు అది. నాలో ఉన్న సత్యవస్తువుని, నాలో నిరంతరం ప్రకాశిస్తున్న నిత్యవస్తువుని, యదార్థ వస్తువుని ఉన్న దానిని ఉన్నట్టుగా నేను గ్రహించలేక పోవడమే అజ్ఞానం. అదే అవిద్య. నేను ఎవడను అనే ప్రశ్నకు సమాధానం వచ్చిన రోజున అజ్ఞానం పోతుంది. ఇప్పుడు మనం ప్రశ్న వేసుకుంటున్నాం కానీ సమాధానం ఇంకా దొరకలేదు. అంత లోపలకి వెళ్ళడానికి ఇష్ట పడటం లేదు మన మనస్సు. ఎందుచేతనంటే మళ్ళీ మన రాముడు ఏమైపోతాడు, లేకపోతే మన కృష్ణుడు ఏమైపోతాడు, అంటే రాముడుఎదురుగా ఉండాలి, కృష్ణుడు ఎదురుగా ఉండాలి, శంకరుడుఎదురుగా ఉండాలి. మనం అడిగినవి ఆయన ఇస్తూ ఉండాలి. మనం పూజ చేస్తూ ఉండాలి. ఆయన ఎప్పుడూ అలా ఉండిపోవాలి, మనం ఎప్పుడూ ఇలా ఉండిపోవాలి. చల్లగా అలా రోజులు వెళ్లిపోవాలి. ఇదే మన జీవితం. దేవుడు ఉండాలి, మనం ఉండాలి, భోగించడానికి ప్రపంచం ఉండాలి. ఇదే మన జీవితం. ఈ మూడు ఉన్నంతకాలం ఎప్పుడూ మనం సంసారంలో ఉండవలసిందే.

జర్మనీ దేశంలో ఒక పెద్ద తత్త్వ వేత్త ఉండేవారు. గొప్ప ఫిలాసఫర్. ఎంతో పండిన మనిషి. ఆయనకి ముసలితనం వచ్చాక ఒక రోజున చేతిలో కర్ర పుచ్చుకుని షికారుగా

ఎక్కడికో ఒంటరిగా వెళుతున్నాడు. ఆయనకి ఎక్కువ ఏకాంతం అంటే ఇష్టం. ఏకాంతంగానే షికారుకి వెళుతున్నాడు ఏదో కొంతదూరం నడిచి వెళ్ళటానికి. దారిలోనే ఈ తత్త్వవేత్తకి ఎదురుగుండా ఒక పెద్ద మనిషి వస్తున్నాడు. ఈయన కర్ర ఇలా పొడుచుకుంటూ వెళు తున్నాడు కదా, సరిగ్గా ఆ కర్ర ఆయనకి తగిలింది. కోపం వచ్చింది ఆ పెద్ద మనిషికి. ఈయన ఎంత పెద్ద తత్త్వవేత్తో ఆయనకి తెలియదు. కోపం వచ్చి ఏమన్నాడు అంటే ఎవడవురా నువ్వు అన్నాడు. అప్పుడు ఈ తత్త్వ వేత్త అన్నాడు ఎవడవురా నువ్వు అంటున్నావు. నేను ఎవడనో నువ్వు చెప్పగలిగితే ఈ ప్రపంచాన్ని అంతా నీకోసం సంపాదించి నీకు ధారపోస్తాను. నేను ఎవర్నో నువ్వు చెప్పు అన్నాడు. వాడు ఎవడో వాడికి తెలియదు, వీడు ఎవడో వీడికి తెలియదు. ఎందుచేత అంటే నేను ఎవడినో తెలిస్తేనే కాని మనకు స్వరూపదర్శనం కాదు. ఈ దేహాలు ఇలా వస్తాయి, అలా పోతాయి. అహంకారం ఉన్నంతసేపు దేహాలు వస్తూనే ఉంటాయి. ఎందుచేత? అహంకారానికి దేహం కావాలి. మీరు ఒక్కటి జ్ఞాపకం ఉంచుకోండి, అహంకారం ఎప్పుడూ ఏదొక రూపం గురించి ఆలోచిస్తూ ఉంటుంది. అది దేవుడు అవ్వచ్చు, మీ బంధువులు అవ్వచ్చు, మీ స్నేహితులు అవ్వచ్చు. ఎవరైనా సరే, అహంకారం ఎప్పుడూ ఒక రూపాన్ని పట్టుకుని ఆ రూపం గురించి ఆలోచిస్తూ ఉంటుంది. అహంకారానికి రూపం కావాలి కాబట్టి అహంకారం ఉన్నంతసేపు రూపాలు అలా వస్తూ ఉంటాయి. మన కళ్ళకు కనిపిస్తున్నటువంటి ఈ లోకాన్ని మనం పూజిస్తున్న దేవుడిని, ఈ అన్నిటిని కూడా మన అహంకారం కల్పిస్తుంది. నేను, నేను అనే అహంకారమే ఈ అన్నిటినీ కల్పిస్తుంది. జీవుడిని అదే కల్పించింది, లోకాన్ని అదే కల్పించింది. దేవుడిని అదే కల్పించింది. జ్ఞాని లక్షణం ఎలా ఉంటుంది, అజ్ఞాని లక్షణం ఎలా ఉంటుంది. జ్ఞానికి అజ్ఞానికి తేడా ఏమిటి? అజ్ఞానికి ఎప్పుడూ ఈ నేను గుర్తు ఉంటుంది. జ్ఞానికి మచ్చుక కూడా నేను గుర్తు ఉండదు. ఇద్దరికీ అదే తేడా.

పెద్ద పాండిత్యం ఉంటే జ్ఞానం యొక్క లక్షణం కాదు. ధనం జ్ఞానం యొక్క లక్షణం కాదు. మహిమలు జ్ఞానం యొక్క లక్షణం కాదు. ఏదో ప్రపంచంలో కొన్ని గొప్ప కార్యాలు సాధించటం జ్ఞానం యొక్క లక్షణం కాదు. ఏది జ్ఞానం యొక్క లక్షణం? నేను, నాది అని ఎవడికి ఎప్పుడూ గుర్తు ఉండదో వాడు జ్ఞాని. 24 గంటలు ఈ నేను, నాది ఎవడైతే మర్చిపోడో వాడు అజ్ఞాని. మనం చూడండి నేను, నాది అనేవి నిరంతరం మనకు స్మరణలో ఉంటాయి. మనకు అజ్ఞానం ఉన్నట్టే లెక్క. జ్ఞానికి నేను నాది అనేది వాడి స్ఫురణలోనే ఉండదు అసలు.

వాడు జ్ఞాని. మనం అజ్ఞానంలో ఉన్నామా, జ్ఞానంలో ఉన్నామా ఇంక భగవద్గీత చెప్పక్కర్లేదు. ఎవడి మటుకు వాడే చూసుకోండి. పైకి చూడకండి, బయటకి చూడకండి, లోపలకి చూసుకోండి. ఎందుచేత ఈ నేను బయట లేదు, లోపల ఉంది. పైకి చూస్తే కనపడదు, బయటకి చూస్తే కనపడదు. లోపలకి చూడాలి. మనకి లోపలకి వెళదాం అంటే మన కోరికలు అంగీకరించవు. మన కోరికలు లోపలకి దిగనివ్వటం లేదు కాబట్టి మనం అసలు వస్తువే లేదు అనుకుంటున్నాం. పరమార్థమే లేదు అనుకుంటున్నాం. మీరు విషయాన్ని బాగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యండి. మోక్షం ఇప్పుడే వరిస్తుంది మిమ్మల్ని. అది ఎప్పుడో వస్తుంది, ఎక్కడో వస్తుంది అని అలా ఊహించుకోకండి.

ఆత్మ తప్పించి మిగతావి అన్నీ మానవుడు యొక్క మనస్సు కల్పించినవే. ఆత్మ సదా హృదయంలో ప్రకాశిస్తున్నది. చెట్టు నుంచి ఆకులు ఎలా రాలిపోతాయో, అలా ఎవరి మనసులోంచి ఈ వాసనలు రాలిపోయాయో, వాడి మనసు ఆ సెకనులో ఆత్మాకారం చెందుతుంది. ఇప్పుడు మీరు అందరూమోక్షంలోనే ఉన్నారు. మోక్షంలోనే ఉండి మోక్షం కోసం వెతుకు కుంటున్నాం. మోక్షం కోసం ప్రయాణం చెయ్యాలి అనుకుంటున్నాం. ఎంత మాయో చూడండి. ఇదే ఈశ్వరుని యొక్క లీల. పూర్వజన్మలలో దేహభావనతోటి మనం చేసిన కర్మని బట్టి, మనం చేసిన పనిని బట్టి, దూడని కట్టురాడుకి కట్టేసినట్టు మన వాసనల తోటి మనలనే కట్టేశాడు. అదే ఈశ్వరుడు చేసే పని. మన వాసనలే తాడుగా తయారు చేసి మన పీకి కట్టేశాడు. అందుకే దేహభావన మనలను విడిచి పెట్టటం లేదు. వాసనలని ధ్యానం చేస్తూ, వాసనలని స్మరిస్తూ వాసనలని ఎవడు దాటి వెళ్ళలేడు. సోదరమహాశయులారా ఒక చిన్న విషయం మీరు జ్ఞాపకం ఉంచుకుంటే ఇంకేమి అక్కర్లేదు. నా అహంకారం నాకు అత్యంత ప్రీతి. నా రాగ ద్వేషాలు నాకు అత్యంత ప్రీతి. మీరు ఎన్ని గ్రంథాలు చదవండి, ఎన్ని యాత్రలు చెయ్యండి, ఎన్ని ఉపన్యాసాలు వినండి. ఎంతమంది గురువులని సేవించండి,



**గురువు అంటే చీకటిని పోగొట్టేవాడు. బయట చీకటిని పోగొట్టేవాడు సూర్యుడు. మనలో అంతర్యామిగా ఉండి లోపలి చీకటిని అంటే అజ్ఞానాన్ని పోగొట్టే వాడు గురువు.**

దానాలు చేయండి, భోగాలు అనుభవించండి, ఎంత చేసినా, ఎంత చేసినా, ఈ ఒక్క విషయం మీరు మర్చిపోకండి. అహంకారం తోటి ఆత్మానుభవం పొందలేము. అహంకారం యొక్క అనుభవానికి ఆత్మ దొరకదు. ఆత్మలో మీరు ప్రవేశించాలి అంటే అహంకారం వదిలే తీరాలి. అహంకారాన్ని వదలకపోతే ఆత్మ అనుభవం ఎవరికీ రాదు. ఎంత గొప్ప పండితుడికి కూడా సాధ్యం కాదు. అహంకారం విడిచి పెట్టకుండా ఆత్మని అనుభవంలోకి తెచ్చుకున్నవాడు, అహంకారం విడిచి పెట్టకుండా ఆత్మని తెలుసుకున్న వాడు ఇంతవరకు సృష్టిలో ఎవడైనా ఉన్నాడా? లేడు. మీరు ప్రశాంతంగా కూర్చుని ఈ విషయాలు మీరు ఎందుకు ఆలోచించరు.

కాశీలో చదువుకున్న ఒక పెద్దమనిషి నా దగ్గర అన్నాడు మేము విశ్వేశ్వరుడి గుళ్ళోకి వెళ్లాం అండి అది రాయే కదా అన్నాడు. నీకు రాయి అవ్వచ్చు. భక్తులు రాయి అనుకోవటం లేదు. భక్తులు ఉద్దేశ్యం శివుడు అనే వెళుతున్నారు ఇంతమంది ఇంత డబ్బులు ఖర్చు పెట్టి కాశీ వెళుతున్నారు అంటే అది రాయని వెళుతున్నారా, శివుడు అని వెళుతున్నారా, దేవుడు అనే వెళుతున్నారు. రాయి అనుకుంటే అంతదూరం వెళతారా అండి. శంకరుడు అనే భావనతో వెళుతున్నారు. అయితే ఇప్పుడు మనకి ప్రశ్న ఏమిటి, మనం ఏ గుళ్ళోకి వెళ్ళినా, ఇలా గుళ్ళోకి చూసి కళ్ళు మూసుకుంటాం. మనకు ఎవరు చెప్పరు కళ్ళు మూసుకోమని. కాని మన అంతట మనమే కళ్ళు మూసుకుంటాం. దాని అర్థం ఏమిటి అంటే, ఆ దేవుడు మనకు తెలియకుండానే మన మనస్సుని అంతర్ముఖం చెయ్యడానికి ప్రయత్నం చేస్తున్నాడు వాడే దేవుడు. నన్నేం చూస్తావురా, నీ లోపలకి చూసుకో, నీ లోపల ఉన్నాను. నీ కళ్ళు మూసుకో, మనస్సు మూసి లోపలకు పంపు. నేను బయట ఉన్నాను అనేది అబద్దమే. నీ లోపల ఉన్నవాడిని నిజమైన నేను. లోపలకు చూసుకోవటం కోసం ఆ దేవుడు మనకు సహాయం చేస్తున్నాడు. అది మనకు తెలియకుండా కళ్ళు మూసుకుంటున్నాం. నోరు మూసుకుంటాం. ఇవి రెండు అలవాటు అయ్యాయి మనకి, ఇంకా మనసు మూసుకోవటం అలవాటు అవ్వలేదు. ముందు కళ్ళు మూసుకోవటం, నోరు మూసుకోవటం అలవాటు చేసుకుంటే కొంతకాలానికి ఎప్పుడైనా అలవాటు అవుతుంది మనసు మూసుకోవటం. ఒక్క విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మనస్సు అణగకపోతే, మనస్సులోఉన్నటువంటి మలినం తొలగకపోతే, పరమాత్మ దగ్గరకిచేరుకోవడానికి దారే కనపడదు. పరమాత్మ యొక్క అస్థిత్వాన్నే మన మనసు నమ్మదు. స్థూలబుద్ధికి పరమాత్మ ఉన్నాడని కూడా గోచరించదు. బుద్ధి సూక్ష్మం అయితేనే పరమాత్మ

యొక్క అస్థిత్వం అంగీకరిస్తారు.

మేము ధ్యానం చెయ్యటానికి కూర్చుంటున్నాం మనసు బయటకి వెళ్లిపోతుంది అంటారు చాలామంది.ఎందుకు వెళ్లిపోతుంది బయటకి మనసు? మనకు భోగం అనుభవించాలి అనే వాంఛ, ఆ వాసన మనకి లోపల ఉన్నప్పుడు మనసు బయటకి వెళ్లిపోతూ ఉంటుంది. అప్పుడు మనస్సును వైరాగ్యం తోటి ఆపు చెయ్యి అని పరమాత్మ గీతలో చెప్పాడు. తరువాత ఏమని చెప్పాడు. అభ్యాసం అని చెప్పాడు. ముందు మనసుని విచ్చల విడిగా బయటకు వెళ్లకుండా వైరాగ్యం తోటి ఆపు చేస్తే మనసుకి నిలకడ కలుగుతుంది. ఆ నిలకడ కలిగిన మనసుని,ఏకాగ్రమైన మనసుని, అభ్యాసం హృదయం వైపుకి తిప్పుతుంది. వైరాగ్యం మనసు బహిర్ముఖం అవ్వకుండా ఆపు చేస్తుంది. మనసు హృదయం వైపుకి ప్రయాణం చెయ్యటం కోసం అభ్యాసం ఉపయోగ పడుతుంది. అది వైరాగ్యం, ఇది అభ్యాసం. అంటే ఇవి రెండు ఏ సాధకుడికి అయితే ఉన్నాయో వాడు సఫలీకృతుడు అవుతాడు. వాసుదేవస్వామి స్వరూపం ఏమిటి? ఆత్మ స్వరూపం. వాడు వాసుదేవ స్వరూపాన్ని తెలుసుకుంటాడు. ఆత్మని ధ్యానం చెయ్యటం ద్వారా లోపల కోరికలు తగ్గుతాయి. కోరికలు ఎందుకు వస్తున్నాయి మనకి. ఏదొక సుఖం అనుభవించడం కోసం. ఎర్ర చీమని పట్టుకునిమీరు ఏదైనా పంచదార గుట్టలో పడేయండి అది కదులుతుందా అక్కడ నుంచి. అదే విధంగా నీ హృదయంలో ఉన్నటువంటి సుఖం. నీ హృదయంలో ఉన్నటువంటి శాంతి నీకు దొరికేవరకు నీ మనసు బయటకి వస్తూ ఉంటుంది అంటే మనసు బహిర్ముఖం అవుతూ ఉంటుంది. నాకు శాంతి కనుక దొరికితే నా మనసు బయట సుఖం కోసం ప్రయత్నం చెయ్యదు. ఇది జ్ఞాపకం ఉంచుకోండి. బయట సుఖం కోసం, బయట భోగం కోసం మనసు వెతుకుతోంది అంటే ఆ మనిషికి లోపల శాంతి గాని, సుఖం కాని దొరకలేదు అన్నట్టు గుర్తు. లోపల మీకు శాంతి దొరికితే, లోపల మీకు కనుక సుఖం దొరికితే, మీకు దేవుడు తోటి కూడా పనిలేదు.

ఆత్మ విషయం అటు ఉంచండి. అంత దూరం వెళ్లద్దు మీరు, దగ్గర విషయాలే చెప్పుకుందాం పోనీ. మంచి మంచి చక్కటి గుణాలు సంపాదించడం కోసం ఎవరు ప్రయత్నం చేస్తున్నారు అండి. మనం వివేకానందని గౌరవిస్తున్నాం. ఆయన కంటే తెలివైన వాళ్ళు ఎవరు లేరా? మనం రమణ స్వామిని గౌరవిస్తున్నాం. ఆయన కంటే మేధావులు ఎవరు లేరా? ఎందుకు గౌరవిస్తున్నాం. అపూర్వమైనటువంటి, ఉదాత్తమైనటువంటి వారి

గుణసంపదని చూసి మనం వాళ్ళని గౌరవిస్తున్నాం, వాళ్ళ పటాలు మన ఇళ్ళల్లో పెట్టుకుంటున్నాం. వాళ్ళకంటే తెలివి గలవారు సృష్టిలో అనేకమంది ఉన్నారు. కేవలం తెలివి తేటలను బట్టే వాళ్ళను మనం గౌరవించడం లేదు. వాళ్ళకున్న గుణసంపద వల్ల గౌరవిస్తున్నాము. దైవీగుణాలు కనుక మనం సంపాదించుకుంటే ఆ దైవీగుణాలు మన ఆత్మని తెలుసుకోవడానికి సహకరిస్తాయి. సోదరమహాశయులారా, త్యాగం చెయ్యలేని వాడికి ఎవడికి ఆత్మజ్ఞానం కలగదు. కలగదు. కలగదు.మీరు దేవతలని ఆరాధించడం కాదు ప్రధానం. ఈ లోకంలోనే కాదు, పరలోకంలో కూడా త్యాగం చెయ్యని వాడికి ఎవడికి ఆత్మ దర్శనం ఇవ్వదు. ఆత్మ గోచరించదు. దాని గురించి అవగాహన మన మనసుకి కలగదు. ఆత్మ సాక్షాత్కారం, సత్య సాక్షాత్కారం మనకి కలగదు. ఎప్పటివరకు? మనం త్యాగం చేసేవరకు. ఏది త్యాగం? మనకున్నటువంటి వాసనలని, మనకున్నటువంటి కోరికలని, మనకున్న భోగ దృష్టిని, త్యాగం చేసేవరకు, చిట్ట చివరి కోరిక త్యాగం చేసేవరకు, ఆత్మజ్ఞానం కలగనే కలగదు. మీరు ఏ గ్రంథం చదవండి. మీరు బైబిలు చదువుతున్నారా, గీత చదువుతున్నారా అని కాదు. మనకున్న వాంఛలలో ఒక్క వాంఛని సాధన ద్వారా త్యాగం చెయ్యగలమా? అసలు దేవుడిని ప్రార్థన చెయ్యటమే మనకున్న వాంఛలని పెంచుకోవడం కోసం ప్రార్థిస్తుంటే ఇంక మనకు జ్ఞానం ఏమి కలుగుతుంది? ఎవరన్నారు మనకు జ్ఞానం కలుగుతుంది అని, ఎవరు చెప్పారు? త్యాగి కాని వాడికి జ్ఞానం కలగనే కలగదు.

ఆడంబర జీవితం, బుద్ధిలో ఆడంబరం. నడవడికలో ఆడంబరం, ఈ ఆడంబర జీవితానికి అలవాటు పడ్డ వాళ్ళకి జ్ఞానం ఎంతో దూరంగా ఉంటుంది. నిరాడంబరుడికే జ్ఞానం కలుగుతుంది. మాటలో నిరాడంబరం, చేతలో నిరాడంబరం, దైనందిన జీవితంలో నిరాడంబరంగా ఉండాలి. మనసు చల్లబడిన వారికే ఆత్మ దర్శనం ఇస్తుంది. ఎవడైతే తనకున్న జీవ లక్షణాలని త్యాగం చేశాడో వాడికి మాత్రమే జ్ఞానం కలుగుతుంది. మనమాట వదిలేయండి, ప్రజాసేవ చేసేవాళ్ళు కూడా ఈ నేనుని మర్చిపోరు. ఎందుచేత? ఈ ప్రజాసేవ కూడా నేనుని అలంకరించుకోవడం కోసమే. ఈ నేను గొప్ప కోసమే అది కూడా. నేనుని పోగొట్టుకోమని భగవంతుడు చెబుతుంటే నేనుని అలంకరించుకుంటే జ్ఞానం కలుగుతుందా, నేనుని మర్చిపోయి జీవితంలో ఎప్పుడైనా ఏదైనా పని చేశారా, నేను అనే శబ్దాన్ని మర్చిపోయి,

నాది అనే శబ్దాన్ని మర్చిపోయి, జీవితంలో ఎప్పుడైనా ఒక చిన్న పని చేశామా, ఒక చిన్న పని. మానవుడు ఏమి చేస్తాడు అంటే ఎవడికి ఇష్టమైన పని వాడు చేస్తాడు మంచి పని చేయడు. ఎవరికి ఇష్టమైనది అది వాడికి కష్టమైనా చేస్తాడు. కాని తన ఇష్టాన్ని వదులుకుని మంచి పని చేయడానికి శక్తి మనకి చాలటం లేదు. ఇది మన అనుభవంలో ఉన్నదే.

ఒక మాష్టారు ఉండేవారు తిరువణ్ణామలైలో ఆయన భగవాన్ దగ్గరకి వెళుతూ ఉండేవారు స్కంధాశ్రమం దగ్గరకి. నేను రెండు నెలల నుంచి వెళుతున్నాను భగవాన్ దగ్గరకి. రెండు నెలల నుంచి వెళ్తుంటే ఏమి ఉపకారం జరగలేదు అని మానేశాడు. మూడు నెలలు మానేశాడు. ఇంచు మించుగా 100 రోజులు మానేశాడు భగవాన్ దగ్గరకి. అప్పుడప్పుడు జ్ఞాపకం వస్తున్నాయి. ఆయనను చూడాలి అనిపిస్తోంది. వంద రోజులు మానేశాడు మళ్ళీ వెళ్ళాడు భగవాన్ దగ్గరకి స్కంధాశ్రమానికి భగవాన్ ని చూశాడు. భగవాన్ నిన్ను చూడాలని ఉంది వచ్చాను. అని కళ్ళవెంట నీళ్ళు పెట్టుకున్నాడు. ఎందుకు కళ్ళ వెంట నీళ్ళు పెట్టుకున్నాడు. చాలాకాలం అయ్యింది చూసిఅని. మరి నువ్వు ఎందుకు రాలేదు. ఆయనకు తెలుసు వీడు ఎందుకు రాలేదో, నువ్వు వంద రోజులు అయ్యింది ఇక్కడకు వచ్చి నువ్వు ఎందుకు రాలేదు నీ దగ్గరకి రెండు మాసాలు తిరిగాను నాకేమి కలిసి రాలేదు. కళ్ళ వెంట నీళ్ళు పెట్టుకుంటున్నాడు ఇలా చెబుతూ. లాభం రాలేదు నిజమే, వంద రోజులు మానేసినందుకు నష్టం తెలుస్తోంది కదా. వచ్చిన నష్టం ఏమిటో నీకు తెలుస్తోంది కదా ఇప్పుడు. అసలు విషయం ఏమిటి అంటే మహాత్ముల దర్శనం చాలా పుణ్య ప్రదం. వాళ్ళు మనతోటి మాట్లాడక్కర్లేదు. ఏమి చెప్పక్కర్లేదు. ఒక్క దర్శనం చాలు. అది ఎంత ఫలితం వస్తుందో మనకు తెలియదు. అది జన్మ జన్మాంతరాలలో ఎక్కడో మనలని తీసుకుని మన స్వరూపాన్ని మనకు పట్టి ఇస్తుంది. చూపు మనమీద పడితే చాలు, ఒక్క చూపు చాలు, దుఃఖం అంతా ఆరిపోతుంది. మన సొంత ప్రయత్నాల మీద, సొంత సాధనల మీద ఎంతో

**గురువు అలా చెయ్యి ఇలా కూర్చో అని చెప్పడు. ఆత్మానుభవం పొందటానికి నిన్ను ఎలా ప్రయాణం చేయించాలో అలా ప్రయాణం చేయిస్తాడు. చేసేవాడికి మాటలతో పనేముంది? ఎక్కడ మాటలు లేవో అక్కడ ఆయన ఉన్నాడు.**



కష్టపడి, ఎన్నో ధ్యానాలు చేసి, ఎన్నో వ్రతాలు చేసి, ఎన్నో పూజలు చేసి, మన చేత్తోటి మనం లాక్కోలేని కోరికలు కూడా కాలి రాలిపోతాయి. మహాత్ముల దర్శనం వల్ల పుణ్యం వస్తుంది. అంతేకాదు మహాత్ములు ఏమి చెప్పక్కర్లేదు. వారి యొక్క అస్థిత్వం చాలు. వాళ్ల ఊపిరి చాలు. వాళ్ళు దేహం ధరించి ఉంటే చాలు. అంతకంటే ఏమి అక్కర్లేదు. వాళ్ళు ఏమి మాట్లాడక్కర్లేదు. ఉపన్యాసాలు చెప్పక్కర్లేదు. పుస్తకాలు రాయక్కరలేదు. ఎందుచేత? మనం ఏ వస్తువు కోసం వెతుకు కుంటున్నామో ఆ వస్తువు అయ్యి ఉన్నాడు. ఆ చల్లటి చూపు మనమీద పడితే మన బాధలు అన్నీ కరిగిపోతాయి. మనం సాధన చేసి సాధించక్కర్లేదు. భగవాన్ ని వెళ్లి దర్శనం చేయగానే భగవాన్ ఏమంటున్నారు, సాధు దర్శనం దుర్లభం, వాళ్లని తరచూ దర్శించటం మంచిది.

జ్ఞానికి లోకం అంతా ఒక్కటే. రమణాశ్రమం అంటే నాలుగు గోడల మధ్యే ఆశ్రమమా? లోకం అంతా రమణాశ్రమమే. వాడే జ్ఞాని. ఎవడికైతే జ్ఞానం అంటే అపేక్ష ఉంటుందో, వాళ్ళు అందరూ కూడా జ్ఞానుల ద్వారా లబ్ది పొందుతారు. లాభం పొందుతారు. మీకు జ్ఞానం యందు అపేక్ష ఉంది అనుకోండి, మీకు జిజ్ఞాస ఉంది అనుకోండి తప్పనిసరిగా మీకు మహాత్ముల ద్వారా మీరు ఎక్కడ ఉన్నా, ఏ మూలన ఉన్నా సహాయం అందుతుంది. ఊరికే ఆపేక్ష ఉంటే చాలు. ముఖం అటు తిప్పితే చాలు. రమణ స్వామి ఉన్నారు అనుకోండి, రామకృష్ణులు ఉన్నారు అనుకోండి వారి చుట్టూ ఉన్నవారికే జ్ఞానం వస్తుంది మిగతా ఎవరికి రాదు అనుకోకండి మీరు, లోకంలో ఏ మూల ఉన్నప్పటికీ జ్ఞానం యందు అపేక్ష ఉంటే వాళ్ళు తప్పనిసరిగా వాళ్ళు పొందిన స్థితి లోంచి లాభాన్ని పొందడానికి వారి వాటా వారికి అందుతూ ఉంటుంది ఏమూల ఉన్నాసరే. అది జ్ఞానం యొక్క గొప్పతనం. జ్ఞానం అంటే పరమేశ్వరుడు. జ్ఞాని యొక్క అనుగ్రహం ఎవరికైనా ఉంటే వాళ్ల ప్రయత్నం ఏమి అక్కర్లేకుండా వాడికి జ్ఞానం లభిస్తుంది. జ్ఞానం యందు ప్రేమ కలగటమే చాలా కష్టం. మన మనస్సు ఇంకా అంతర్ముఖం అవ్వలేదు. అందుచేత జ్ఞానం విలువ తెలియటం లేదు. జ్ఞానం అన్నా, మోక్షం అన్నా, ఆత్మ అన్నా, స్వర్గ రాజ్యం అన్నా,ఇవన్నీ ఒక్కటే. జ్ఞానం యొక్క ఔన్నత్యం ఈ లోకంలో మీకు చెప్పేవాళ్ళు ఎవరు లేరా?అని ఆచార్య స్వామివారు అన్నారు. మీకు ఎంత దుఃఖం ఉన్నా సరే జ్ఞాని యొక్క సమక్షంలో కూర్చుంటే ఆ దుఃఖం అంతా కరిగిపోతుంది.

అలా కరగకపోతే వాడు జ్ఞానే కాదు. మీకు ఎంత దుఃఖం ఉన్నా సరే జ్ఞానిని చూసేటప్పటికి మీ దుఃఖం చల్లారి పోవాలి. వాడు జ్ఞాని. ఎవడిని చూస్తే మీ మనస్సు అంతర్ముఖం అవుతుందో వాడే గురువు. ఇంకొక్క చిన్న విషయం మీరు గుర్తు పెట్టుకోండి. వైకుంఠానికి మీరు వెళ్ళినా అది స్వప్నమే. కైలాసానికి వెళ్ళినా అది స్వప్నమే. నిద్రట్లో ఒక కల వస్తుంది మనకి మీ దేహం మంచం మీద ఉంటుంది. మన మనస్సు ఇంకొక దేహాన్ని కల్పిస్తుంది. ఆ దేహం తోటి మనం కలకత్తా వెళ్లినట్టు స్వప్నం వస్తుంది. ఆ దేహం తోటి కలకత్తా వెళ్ళటం, కలకత్తా చూడటం, వచ్చేయటం. ఇక్కడ భగవాన్ చెప్పే విషయం ఏమిటంటే, ఈ దేహానికి, ఆ దేహానికి తేడా లేదన్నారు. మెలకువ వచ్చాక ఆ దేహం ఏమైపోయింది అని ఎవరైనా వెతుకుతారా అని అడిగారు. ఎందుచేత వెతకడు? ఇదంతా అబద్ధం. దేహంలో ఉండగా ఎవడికి అయితే ఆత్మ దర్శనం అయ్యిందో, ఎవడికి అయితే జ్ఞానం కలిగిందో, ఆ స్వప్న దేహం ఎటువంటిదో, ఈ దేహం కూడా అలాగే కనిపిస్తుంది అట జ్ఞానికి. వాడు జ్ఞాని.


భాగవతంలో ఏమని చెప్పాడు అంటే సారా బాగా మత్తుగా తాగేవాడికి దేహం మీద బట్ట ఉందో, లేదో వాడికి తెలియదు అలాగే జ్ఞానికి కూడా తన దేహం ఉందో, లేదో అన్న సంగతి కూడా వాడికి తెలియదు. దేహం ఉండచ్చు, ఊడిపోవచ్చు, వాడి అస్థిత్వానికి భంగం లేదు. వాడు జ్ఞాని. జ్ఞానికి నీవు, నేను అనే బేధం లేదు. నేను ఉన్నవాడికి నీవు ఉంది. నేను లేనివాడికి నీవు లేదు. జ్ఞాని ఎదుటివాడికి ఏదో ఉపకారం చేస్తున్నాను అనే భావన కూడా వాడికి ఉండదు. ఎందుచేత వాడికంటే వేరుగా ఏమి లేదు కాబట్టి. ఏవండీ రమణ మహర్షి ఏమి సాధన చేస్తే ఆయనకి జ్ఞానం వచ్చింది చెప్పండి మీరు. మీరు చేస్తున్న సాధనలు ఆయన చేశాడా? మీరు ఎంతో కష్టపడుతున్నారు కదా, ఏమి సాధన చేస్తే ఆయనకి జ్ఞానం కలిగిందో చెప్పండి మీరు. అసలు సాధన ఏమి చెయ్యలేదు, పూజ చెయ్యలేదు, నోము నోయ్యలేదు, ఏమి చెయ్యలేదు. మరి ఎలా కలిగింది ఆయనకి జ్ఞానం? అసలు పరబ్రహ్మ ఉందని తెలియదు, దాని గురించి ఎప్పుడైనా కనీసం వినకుండానే ఆ వస్తువును పొందాను అన్నాడు. ఎవరి సహాయం వల్ల పొందాడు? ఈశ్వరుడి సహాయం వల్ల పొందాడు. జ్ఞానం మాట అటు ఉంచితే ఈశ్వరఅనుగ్రహం లేకపోతే మనకు ద్వైతబుద్ధే పోదు అసలు. ఈశ్వరుడు వేరు, నేను వేరు అనే భావనే పోదు అసలు. ఈశ్వరానుగ్రహం వల్ల మటుకే మనకి అద్వైతబుద్ధి

కలుగుతుంది. ఈశ్వర అనుగ్రహం లేకపోతే మీరు ఎన్ని పూజలు చేసినా ద్వైతబుద్ధి బయటకు వెళ్ళదు.

ఒకసారి రమణ స్వామి ఒంటరిగా కూర్చున్నాడు కొండ మీద. శేషాద్రి వెళ్లి భగవాన్ దగ్గర స్వామి, స్వామి నాకు ఎంతసేపు ఆ అరుణాచలేశ్వరుడికినమస్కారం చెయ్యాలి అని, ఆయనకి జపం చెయ్యాలని, అరుణాచలేశ్వరుడికి పూజ చెయ్యాలని ఇవి అంటే నాకు చాలా ఇష్టం అన్నారు. ఎవరు? శేషాద్రి. నాకు ఈ పూజ అంటే ఇష్టం అని శేషాద్రి అన్నాడు. అప్పుడు భగవాన్ అన్నారు నీకు పూజ చెయ్యడం బాగా ఇష్టమే. పూజ చేసేవాడు ఎవడు? చేయించుకునేవాడు ఎవడు? ఈ ఇద్దరూ ఎక్కడ నుంచి వచ్చారు? ఈ ఇద్దరూ ఎవరు? అప్పుడు శేషాద్రి అన్నాడు అదే నాకు తెలియటం లేదు నాకు చెయ్యాలని ఉంది, ఆయన చేయించుకుంటున్నాడు. నాకు దణ్ణం పెట్టాలని ఉంది. ఆయన దణ్ణం పెట్టించుకుంటున్నాడు. కాని దణ్ణం పెట్టేవాడు ఎవడు? పెట్టించుకునే వాడు ఎవడు అని ఆ దృష్టే కలగడం లేదు. అప్పుడు భగవాన్ అన్నారు. వాళ్ళిద్దరూ ఎవరో ముందు పట్టుకోవాలి. అంటే అదే నాకు తెలియటం లేదు. నాకు ఇదే ఇష్టం. నాకు ఇలా దణ్ణం పెట్టుకోవడమే ఇష్టం అని తల వంచుకుని వెళ్ళిపోయాడు శేషాద్రి. ద్వైతబుద్ధి పోవడం చాలా కష్టం, అజ్యధారయా స్రోతసా సమమ్, సరళ చింతనం విరళతః పరమ్. ధ్యానం ఎలా సాగాలో భగవాన్ చెబుతున్నారు. అజ్య ధారయా నీటి ధారవలె, స్రోతసా సమమ్ నీటి ప్రవాహం వలె ధ్యానం సాగాలి. మనం ధ్యానంలో ఇలా కూర్చుంటే చాలు మళ్ళీ కళ్ళు తెరిచేయాలని ఉంటుంది. ఒక పది నిమిషాలు కూడా మనం ధ్యానం చెయ్యలేము. రామకృష్ణ పరమహంస శిష్యుడు బ్రహ్మానంద స్వామి పదహారు గంటలు చేసేవాడు రోజుకి. రామకృష్ణ పరమహంస గారు చెప్పేవారు అట వాడు నా మానస పుత్రుడు అని. ఎప్పుడు చూసినా ఆయన ముఖం బ్రైట్ గా ఉండేది అట. చాలా సంతోషంగా ఉండేది. ఒకరోజున ఏమి చేశాడు రామకృష్ణుడు దగ్గరకి వచ్చి కూర్చున్నాడు. లోకుల చూపులకి అర్థం కాదు అండి అసలు. కష్టపడి అర్థం చేసుకుందాం అన్నా రామకృష్ణుల వంటివారు మనకి అర్థం అవ్వరు. వాళ్లకి మనమీద ప్రేమ కలిగి వాళ్ళెవరో మనకు తెలిసేలా మన బుద్ధికి వాళ్ళు చెయ్యాలి కానీమన తెలివితేటల వల్ల మనం పట్టుకోలేము. ఏమి రాకాల్ అలా ఉన్నావేంటి? బాగానే ఉన్నానే అంటున్నాడు రాకాల్ పాపం. నువ్వు బాగానే ఉన్నాను

అంటున్నావు కానీ నీ ముఖంలో నాకేదో కొంచెం తేడా కనిపిస్తుంది రాకాల్ అంటున్నాడు రామకృష్ణుడు. నువ్వు జ్ఞాపకం తెచ్చుకో ఇవాళ ఏదో చిన్న అబద్ధం చెప్పావు. అబద్ధం నీ ముఖంలో మార్పు తెస్తుంది అంటాడు రామకృష్ణుడు.పొద్దున్న చెప్పాను వేళాకోళం కోసం ఎవరితోనో చిన్న అబద్ధం చెప్పాను.

ఆయనను మోసం చేయటం కోసం అబద్ధం చెప్పలేదు. నా స్వార్ధం కోసం కూడా నేను అబద్ధం చెప్పలేదు. నీకు స్వార్ధం లేదు అని నాకు తెలుసు, నువ్వు కారణజన్ముడు. నీ స్వార్ధం కోసం అబద్ధం చెప్పావు అని నేను అనటం లేదు కానీ మొట్టమొదట అబద్ధం చెప్పావు, ఎందుకు అబద్ధం చెప్పావు. వేళాకోళం కోసం చెప్పాను. వేళాకోళం కోసం అబద్ధం చెప్పినప్పటికీ అది ముఖం మార్చేసింది రాకాల్. వేళాకోళం కోసం కూడా అబద్ధాలు ఎప్పుడూ చెప్పకు.ఎంత సున్నితత్వమో చూడండి. వాళ్ళకి పుత్ర ప్రేమ ఎంత ప్రేమో చూడండి. నాకు స్వార్ధం లేదు స్వామి అంటున్నాడు రాకాల్. నీకు లేదు అన్న సంగతి నాకు తెలుసు. మనకు నిజం ఎలా ఉంటుందో తెలియదు మన ఇంటా వంటా లేదుగా నిజం అనేది. సోదరమహాశయులారా, రాకాల్ చెప్పిన చిన్న అబద్ధం అయినప్పటికీ ముఖం మీదకి వచ్చింది. మరి మనకి ముఖం మీదకి రావటం లేదేంటి ఎన్ని అబద్ధాలు చెప్పినప్పటికీ ఎందుకు మన ముఖం మీదకి రాదు. తెల్లని బట్ట మీద చిన్న మచ్చ ఉంటే కనిపిస్తుంది కానీ మొత్తం బట్టలు మీద అన్నీ మచ్చలే అనుకోండి ఎక్కడో పరమపవిత్రుడికి చిన్న దోషం ఉంటే అదే కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది



**గురువు మాటలే బోధిస్తాయని నువ్వు అనుకొంటున్నావు. గురువు మౌనం కూడా ఉపదేశిస్తుంది. గురువు మౌనం కూడా నీకు బోధించి, నీ సందేహాలు అన్నీ పోగొడుతుంది. నీ అవిద్యని, బండరాళ్ళ వంటి వాసనలని కూడా పెకిలించి వేస్తుంది. గురువు యొక్క మౌనంలో ఉన్న శక్తి ఎవరూ వర్ణించలేరు. అది వర్ణనకు అతీతం, మాటకు అతీతం, రచనకు అతీతం.**

కానీ మామూలు మానవుడిలో దోషాలు అసలు కనపడే కనపడవు అసలు ఉన్నాయని కూడా వాడికి తెలియదు. చెమట ధారపోసి ఒక మంచి గుణాన్ని సంపాదించుకోండి మీరు. జ్ఞానం విషయం అటు ఉంచండి, చాలా కష్టపడి చెమటోడ్చి ఒక మంచి గుణాన్ని మీరు సంపాదించుకోండి చాలు. మనం చెయ్యవలసింది శ్రద్ధగా చేస్తూ ఉంటే రావలసింది అదే వస్తుంది. అదే కృష్ణుడు చెప్పింది. వాళ్ళు మరణించవలసిన యోగం వస్తే మాములుగా మరణిస్తారు. నువ్వు చెయ్యవలసిన పని మాములుగా చెయ్యి, అయ్యో భీష్ముడిని ఎలా జయించగలం. ద్రోణుడిని ఎలా జయించగలం అని నువ్వు అనుకోవనక్కరలేదు. ఆ తలంపు నవ్వు రానివక్కరలేదు. నువ్వు చెయ్యవలసిన పని మాములుగా చెయ్యి. ఆటోమేటిక్‌గా అది అలా జరుగుతుంది. వాళ్ళు మరణించటం అనేది ఆటోమేటిక్ డివైన్ యాక్షన్. అందుచేత వాళ్ళు మరణించే ఉన్నారు. భగవంతుడికి అసాధ్యం అంటూ లేదు.

మీరు ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. మీ గురువు ఎవరు అయినప్పటికీ ఆయన ద్వారా మీకు ఏదైనా ఉపకారం జరిగింది అని మీరు అనుకుంటే అది చేసింది మీ గురువు కాదు, ఈశ్వరుడే మీ గురువుగా చేస్తున్నాడు. మీకు అలా అనిపిస్తుంది మీ గురువు చేస్తున్నట్టు. ఇదంతా ఈశ్వరుడి యొక్క ప్రణాళిక. మనం ధ్యానం చేసేటప్పుడు రెండు నిముషాలు చేస్తే మనసు చెదిరిపోతూ ఉంటుంది. నిరంతరం చెడిపోకుండా ధ్యానం సాగుతుంటే అది ఏమి చింతన అన్నారు సరళ చింతన. ఈ ధ్యానం కంటే ఆ ధ్యానం మంచిది అన్నారు. విరళ చింతన లేకుండా సరళ చింతన రాదు. అంటే ఏమిటి ముందు ధ్యానం చేసేటప్పుడు ఫెయిల్ అవుతూ ఉంటాం. ఫెయిల్ అయినప్పటికీ అది విడిచి పెట్టకుండా అలా ధ్యానం చేయగా, చేయగా కొంతకాలానికి సరళ చింతన కలుగుతుంది. అంటే నీటి ప్రవాహం లాగ, నదీ ప్రవాహం లాగ ధ్యానం కుదురుతుంది. ధ్యానం చేసేటప్పుడు మీకు ఏదైనా తలంపు వస్తుంది. వాసన బట్టి తలంపు వస్తుంది. ఆ తలంపు వచ్చినప్పుడు, ఈ తలంపు ఎవడికి వస్తోంది అనే ప్రశ్న వేసుకోండి. నాకు వస్తుంది. తలంపు ఎవరికి? నాకే కదా, ఇక్కడే మీరు అర్థం చేసుకోవాలి. నాకు అంటే అహంకారానికే తలంపులన్నీ, తలంపు ఎవరికి? అహంకారానికే వస్తుంది. కోరిక ఎవరికి? అహంకారానికే వస్తుంది. ఏది వచ్చినా అహంకారానికే. ఆత్మకి తలంపు అక్కర లేదు, ఆత్మకి కోరిక లేదు. కోరికలన్నీ అహంకారానికే, తలంపులన్నీ అహంకారానికే. వాసనలన్నీ

అహంకారానికే. సంస్కారాలన్నీ అహంకారానికే. అందుచేత ఈ అహంకారం పడిపోయే వరకు ఈ అహంకారం తన మూలం లోకి వెళ్ళిపోయి లయం అయ్యేవరకు అహంకారం నాశనం అయ్యేవరకు కోరికలు విడిచి పెట్టవు.

మనం గాఢనిద్రలో ఉండగా మనకు ఏమి తెలియదు కానీ ఉన్నాం కదా? ఉన్నాం. ఏమీ తెలీదు కాని ఉన్నాం. మెలకువ రాగానే ఈ లోక తలంపులు రావు మొదట, మొట్టమొదట ఏ తలంపు వస్తుంది? నేను వస్తుంది. మొట్టమొదట మెలకువ రాగానే ఏమి వస్తుంది అండి దేహభావన వస్తుంది, జ్ఞాపకం ఉంచుకుని రేపొద్దున్నే చూడండి. మనకి మెలకువ రాగానే నేను అనే తలంపు లేచిన తరువాత మిగతా తలంపులు అన్నీ వచ్చేస్తాయి. ప్రతీ తలంపు లోపల నేను అనే తలంపు ఉంది. ఆ నేనుని పట్టుకోనంత కాలం, ఆ నేను యొక్క మూలం మనకి తెలియనంత కాలం, ఈ తలంపులు ఆగవు, ఈ లోకాలు ఆగవు, ఈ దేహాలు ఆగవు, ఈ వాసనలు ఆగవు, ఈ కష్టాలు ఆగవు, ఈ బాధలు ఆగవు, ఈ భారాలుమోయ్యటం తప్పదు. ఏది ఆ లోపల ఉన్న నేనుని తెలుసుకునే వరకు, నేను నేను అంటాం చూడండి ఆ నేనుని తెలుసుకునే వరకు. ఆ నేను ఉన్నంతకాలం, ఆ నేను అనే సమస్య పరిష్కారం అయ్యేంతవరకు కోరికలు వస్తూనే ఉంటాయి. దేనికి? నేనుకి. భగవాన్ ఏమి చెప్పారు అంటే మన మనస్సు అణిగి ఉంటుంది దానిని నమ్మద్దు అన్నారు. మనస్సు అణిగి ఉంటే మంచిదే కానీ నమ్మద్దు అన్నారు. ఎప్పుడైనా మిమ్మల్ని కాటేసేస్తుంది అని చెప్పారు. పూర్వం నుంచి మన పెద్దలు ఏమని చెబుతారు అంటే తెల్లవారు జామున నాలుగింటికి, ఐదు ఇంటికి మీకు మెలకువ వస్తుంది కదా, అప్పుడు మీరు ధ్యానం చేసుకోండి, జపం చేసుకోండి అని చెబుతారు. తెల్లవారుఝామున ఎందుకు చేసుకోమంటున్నారు. కారణం ఏమిటి? మనస్సు రాత్రి నిద్రపోతుంది. అది నాశనం అవ్వదు. లయం అవుతుంది. అలా పడుకుని ఉంటుంది మనం పొద్దున్నే స్నానం చేసినప్పుడు ఎలా ఫ్రెష్ గా ఉంటామో, అది నిద్రట్లోంచి బయటకు వచ్చేటప్పటికి ఫ్రెష్ గా ఉంటుంది. మిగతా తలంపులు తొందరగా పట్టుకోవు దానిని. అది విజృంభించకుండా అది ప్రశాంతంగా ఉన్న టైములో ధ్యానం చేస్తే ఒక అరగంటో, గంటో నిలబడుతుంది. ఈ దేహం గురించి మనం ఎంత కష్టపడుతున్నామో, ఈ దేహం గురించి ఎంత శ్రమ పడుతున్నామో, దేహానికి ఎంత చాకిరి చేస్తున్నామో, ఈ

దేహం గురించి పడే పాటులలో వందో వంతు అయినా మనకు జ్ఞానం కలగాలి అని జ్ఞానం కోసం కృషి చేస్తే జ్ఞానం వచ్చేస్తుంది. వందో వంతు. మనం ఏ పని చేసినా దేహం దృష్టిలో పెట్టుకునే చేస్తున్నాం. మన మనసు ఎంతసేపు మన దేహాన్ని అయినా పట్టుకుంటుంది, ఇంకొక దేహాన్ని అయినా పట్టుకుంటుంది. నువ్వు ఒక్క సెకను ఏ రూపాన్ని, ఏ నామాన్ని పట్టుకోకుండా మీ మనసు ఉంటుందేమో చూడండి.

ఈ దేహం ఎవరికి కావాలి? మనసుకి కావాలి. ఆత్మకి అక్కర్లేదు. దేవుడు ఎవరికి కావాలి? మనసుకి కావాలి. ఆత్మకి అక్కర్లేదు. లోకం ఎవరికి కావాలి? మనసుకి కావాలి ఆత్మకి అక్కర్లేదు. అందుచేత ఎప్పుడూ మనో నాశనం అయ్యేవరకు కూడా అజ్ఞానం విడిచి పెట్టదు. దేహాలు విడిచి పెట్టవు. ప్రభువా నీ ఇష్టం అంటారు నాలుగు రోజులు,ఐదవ రోజున పని అవ్వటం లేదు అంటారు పాపం. ప్రభువా నీ ఇష్టం అన్న తరువాత ఇక ఐదవ రోజున పని అవ్వటం లేదు అనేవాడు ఎవడు. ఈ మాట అబద్ధం. అంటే మాట ఊరికే నోటి తోటి అంటున్నారు కానీ హృదయంలో లేదు. శరణాగతి అబద్ధం, శరణాగతి కనుక నిజం అయితే ఈ పని అవ్వలేదు, ఆ పని అయ్యింది అనే భావనే రాదు. శరీరం ఉండాలి. ఈ శరీరం ఉండగానే జీవ లక్షణాలు పోవాలి. జ్ఞాపకం ఉంచుకోండి. మరణానంతరం జీవ లక్షణాలు పోవడానికి అవకాశం లేదు. ఈ శరీరం ఉండాలి, ఈ శరీరం ఉండగానే జీవ లక్షణాలు అన్నీ పోవాలి. ఎప్పుడైతే జీవ లక్షణాలు పోయాయో, అప్పుడు తిరిగి ఆ శరీరం ఉండగానే మళ్ళీ జన్మిస్తాడు వాడే జ్ఞాని. కొంతమంది మాకు ఎక్కువ కష్టాలు వస్తున్నాయి అంటారు. కష్టాలు రావటం చాలా మంచిదే. అంటే మనం కోరి తెచ్చుకోకూడదు కానీ naturalగా వాటంతట అవి వస్తే మంచిదే. ఎందుచేత అంటే కష్టాలు మనసుని అంతర్ముఖం చేస్తాయి. మీరు అనుకున్న పనులు అన్నీ అయిపోతున్నాయి అనుకోండి మనకంటే తెలివి గలవాడు లేడు అనిపిస్తుంది. MLA గారు ఏమి చెప్పారు అంటే నెగ్గినప్పుడు నేను చాలా తెలివి తేటలుగా చూసుకున్నాను అండి మొత్తం ఏ ఊరుకి ఆ ఊరు మనుషులని పెట్టేశాను అన్నారు. అంటే అతని తెలివితేటల వల్ల నెగ్గాను అని అతని ఉద్దేశ్యం. మళ్ళీ అతనే ఓడిపోయాడు MLAగా పోటీ చేసి. ఏవండీ మళ్ళీ ఇప్పుడు వాడు ఓడిపోవడం ఏమిటి,వీడు అనుకున్న వాళ్ళని పెట్టలేదా. అహంకారం అలా అనిపిస్తుంది. మీరు అనుకున్న పనులు అన్నీ అయిపోతూ ఉంటే మీకు

చూడండి ఎంతో కొంత గర్వం వచ్చేస్తూ ఉంటుంది. ఏవండీ అనుకున్న పనులు అవ్వవు అనుకోండి కష్టాలు వస్తున్నాయి అనుకోండి ఏంటి మనం ఎంత ప్రయత్నం చేసినా పని అవ్వటం లేదు ఏమిటి అని మనసు ఒకసారి లోపలకు చూస్తుంది.

రావణాసురుడు భక్తుడు అవునా కాదా అని ఒకరు అడిగారు. రావణాసురుడు భక్తుడే అన్నారు. శివలింగానికి అభిషేకాలు చేశాడు, పూజలు చేశాడు. ఇంతకి ఆయన అడిగిన డౌట్ ఏమిటి ఆఖరున రాముడు ఎందుకు చంపేశాడు అండి రావణాసురుడిని. ఇదే ఇక్కడ రహస్యం చూడండి. రావణాసురుడు భక్తుడే అవ్వడానికి కానీ అతనిలో ఉన్న చెడ్డ గుణాలలో ఒక్క గుణం అతను పోగొట్టుకోలేదు. అందుచేత భగవంతుడు చేత చంపబడ్డాడు. మన పరిస్థితి అలాగే ఉంది. రావణాసురుడు భక్తుడే అవ్వటానికి కానీ ప్రకృతికి సంబంధించిన గుణాలు ఒక్క గుణం తను పోగొట్టుకోలేదు. అంటే ప్రకృతిని దాటలేదు. అందుచేత భగవంతుడు చేత చంప బడ్డాడు. ప్రకృతి గుణాలు మనలోంచి బయటకి పోయే వరకు ఏ దేవుడు మిమ్మల్ని రక్షించలేడు. రావణాసురుడిని ఎందుకు రక్షించలేదు శివుడు. నాకు పూజ చేశాడు కదా అని ఏమైనా అడ్డు పడ్డాడా. ప్రకృతి గుణాలు మనం విడిచి పెట్టాలి. అప్పుడు మనకి ఆత్మ స్వరూపం తెలిసేది, సుఖ స్వరూపం, జ్ఞాన స్వరూపం తెలిసేది. శాంతి స్వరూపం తెలిసేది, అప్పటివరకు ఏ దేవుడు, ఏ దేవత మీకు సహాయం చెయ్యరు. కొంతమంది మనుషుల తోటి స్నేహం చేస్తే ప్రేమ ఎలా ఉంటుందో, జ్ఞానం ఎలా ఉంటుందో, శాంతి ఎలా ఉంటుందో తెలుస్తుంది. మీరు సాధన ఓపిక ఉంటే చేయండి లేకపోతే లేదు. సహవాసాలు విషయంలో బహు జాగ్రత్తగా ఉండండి. ప్రకృతి గుణాలుఉన్నవాడితోటి కనుక సహవాసాలు మీరు చేస్తే ప్రకృతి గుణాలు అన్నీ వచ్చేస్తాయి. కొంతమంది ప్రేమ మూర్తులు

**మనలో పాతుకుపోయిన దేహమే నేను అనే బుద్ధిని తొలిగించటానికి ఏ జన్మకాజన్మ గురువు మనలను వెంటాడుతూ ఉంటాడు. దేహబుద్ధి నుండి విడుదల అయ్యేవరకు గురువు నిన్ను విడిచిపెట్టడు. గురువు అడ్రస్ నీకు తెలియకపోవచ్చు, కాని నీ అడ్రస్ గురువుకి తెలుస్తుంది.**



ఉంటారు. వాళ్ళని చూస్తే చాలు, వాళ్ళతోటి కాసేపు మాట్లాడితే చాలు, ప్రేమ ఎలా ఉంటుందో మనకి అర్థం అవుతుంది. మీకు తెలిసున్నా, మీకు తెలియక పోయినా మీకు వచ్చిన కష్టాలు మీ మనసుని అంతర్ముఖం చేయడానికి మీకు సహాయం చేస్తాయి. నా మాటలు నమ్మండి.

సోదరమహాశయులారా, ఈ దేహంతోటి మనం సంపాదించిన మంచిగుణాలు మన కూడా వస్తాయి. ఈ దేహంతోటి సంపాదించిన చెడ్డగుణాలు మన కూడా వస్తాయి. కానీ దేహం ఇక్కడ రాలిపోతుంది. దేహంతో చేసిన మంచి పని ఉండిపోతుంది. మంచి పని చేసిన దేహం రాలిపోతుంది. మనం కష్టపడి సంపాదించుకున్న మంచి గుణాలు మన కూడా వస్తాయి. ఆ మంచిగుణాలు ఏమి చేస్తాయి మనకు జ్ఞానం కలిగేవరకూ మనల్ని విడిచి పెట్టకుండా మనల్ని వెంటాడుతూ ఉంటాయి. ఏవి? మనం సంపాదించిన మంచిగుణాలు. అదే సంపద. దైవీ సంపద. ఒక మాట చెబుతాను. ఇది నా గుండెల నుంచి వస్తుంది. నిజమైన ఆత్మ ఎలా ఉంటుందో, మోక్షం ఎలా ఉంటుందో మనకు తెలియదు. ఎక్కడ ఉందో మనకు తెలియదు, అది ఎలా ఉంటుందో మనకు తెలియదు. దానిని ఎలా అందుకోవాలో మనకు తెలియదు. కానీ భగవంతుడు చెప్పిన మంచి గుణాలని మనం సంపాదించుకుంటే మీ ఇంటికి మోక్షం వస్తుంది. నా మాట నమ్మండి. మోక్షం ఎక్కడ ఉందో మీకు తెలియదు. అది ప్రయాణం చేసి చేసి మీ మనసులో ఉన్న సౌందర్యానికి మీ గుణసంపదకి పొంగిపోయి, పొంగిపోయి, మీ తలుపు తట్టి మోక్షం మీ ఇంటికే వస్తుంది. ఎక్కడుందో తెలియని మోక్షం కోసం, ఎక్కడ ఉన్నాడో తెలియని దేవుడి కోసం మీరు వెతకటం ఏమిటి? ఆ దేవుడు చెప్పే గుణాలు మీరు అలవరచుకోండి, దేవుడు చెప్పిన గుణాలు మీరు ప్రాక్టీస్ చేయండి. డాక్టరు మెడిసిన్ ప్రాక్టీస్ చేసినట్టు, లాయరు లా ప్రాక్టీస్ చేసినట్టు ఆ దేవుడు చెప్పిన గుణాలని మీరు ప్రాక్టీస్ చేయండి. ఆ దేవుడు మోక్షం మూట పట్టుకుని మీ ఇంటికి వస్తాడు, మీరు తలుపులు వేసుకుని ఉంటే మీ తలుపులు తడతాడు. నా మాట నమ్మండి. ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. బంధువులు అంటే ఎవరండి? భక్తులే నిజమైన బంధువులు. అది హృదయంలో దాచుకోండి. మనకు గుణసంపద పెంచుకోవడానికి వాళ్ళు మనకి సహాయ పడతారు. మీ బంధువులని చూసినప్పుడు మీకు ఎంత ప్రేమ కలుగుతుందో, భక్తులు ఎవరైనా కనిపిస్తే నిజంగా మీకు అంత ప్రేమ కలుగుతోందా, కనీసం

మీ బంధువులని గౌరవించినట్టుగా భక్తులని గౌరవించ లేకపోతున్నారు అలవాటు లేక. జ్ఞానాన్ని మన మనసు తోటి పట్టుకోలేము. రమణస్వామికి ఆ శరీరం తాను కాదని ఆయనకి తెలుసు. కానీ మనం ఆ శరీరం రమణస్వామి అని అనుకుంటున్నాం.

ఆయన శరీరం ఆయన కాదు అని అంటున్నారు. కానీ ఆయన శరీరం ఆయనే అని మనం అనుకుంటున్నాం. అది జ్ఞాన లక్షణం, ఇది అజ్ఞాన లక్షణం. ఆ మాట ఆయనకి అనుభవం ఉంది కానీ మనకి అనుభవం లేదు. మన బద్దలతో మనమే కొలుస్తున్నాం. ఇది అజ్ఞాన లక్షణం. చాడ్విక్ సాధు ఉయ్యాలా మీద ఇలా ఊగుతున్నాడు. ఆ ఇంగ్లాండు వాడు బల్లమీద ఊగుతున్నాడు స్వామి అన్నారు. భగవాన్ వెనకాల ఉన్నారు దూడ మేపుతూ, అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే వాడు ఇంగ్లాండువాడు అంటున్నావు నువ్వు, వాడు మనవాడే. అదేమిటి స్వామి మనవాడు అంటారు ఏమిటి వాడు ఇంగ్లాండు వాడు. వాడు మనవాడు. కొన్ని కారణాల వల్ల ఇంగ్లాండులో పుట్టాడు. మళ్ళీ మన దగ్గరకి వచ్చేసాడు. కొంతమంది సుఖం వస్తే సుఖం వచ్చింది అనుకుంటారు. కష్టం వస్తే కష్టం వచ్చింది అనుకుంటారు. ఏవో కొన్ని అనుభవాలు పొందడం కోసమే దేహం వచ్చింది మనకి. చెబితే మన బుర్రకు ఎక్కవు కొన్ని విషయాలు, మన అనుభవంలో మనం నేర్చుకోవాల్సిందే. ఇలా నడిస్తే బాగుంటుంది అని చెబితే మన బుర్రకు ఎక్కదు. దుర్యోధనా నేను చెప్పింది నీకు అర్థం కావటం లేదు. కృష్ణుడు పరమాత్మ అన్న సంగతి కూడా దుర్యోధనుడికి అర్థం అవ్వటం లేదు. కారణం ఏమిటి అతని ఆశ. మనం కృష్ణుడిని దేవుడిగా నమ్ముతున్నామా? నమ్మినట్టు నటిస్తున్నాం. ఆ దుర్యోధనుడికి ఎంత ఆశ ఉందో మనకి కూడా అంతే ఆశ ఉంది. అందుకే భగవంతుడి అస్థిత్వం మీద మనకి నమ్మకం లేదు, భగవంతుడి మాట మీద మనకి గౌరవం లేదు. ఈ మాట ఎవరికీ చెప్పకండి. భగవంతుడి మీద మనకి విశ్వాసం కలగడం లేదు కారణం ఏమిటి? మన ఆశ. మన ఆశ అందుకోనివ్వదు ఆ అంతస్థుని,ఎదురుగా పరమాత్మని పెట్టుకుని దుర్యోధనుడు గుర్తించలేదు అంటేకారణం మరొకటి ఏమి కారణం కాదు వాడి ఆశ. ఈ భూమి మీద ఉన్నటువంటి వాడి ఆశ. లియో టాల్ స్టాయ్ అన్నాడు ఎవడు ఎంత భూమి సంపాదించినా ఆరడుగులు సరిపోతుంది కప్పెట్టటానికి అన్నాడు. గౌతమ బుద్ధుడు అంటాడు ఓ ఆనంద్ ఎందుకు నా కోసం విలపిస్తావు. మోక్షస్థితిని పొందటానికి ప్రయత్నం

చేసుకో, నాకోసం ఏడిస్తే నీకు ఏమి వస్తుంది. ఏమి త్యాగం అండి, బుద్ధుడు శరీరం విడిచి పెట్టేటప్పుడు ఆనంద్‌తో అంటాడు ఆనంద్ ఏ గ్రామంలో నేను శరీరాన్ని విడిచి పెడుతున్నానో,ఆ గ్రామంలో ఉన్న అందరినీ ఏ స్మశానంలో దహనం చేస్తున్నారో, ఈ శరీరాన్ని తీసుకు వెళ్లి ఆ స్మశానంలో దహనం చేసేయ్ ఆనంద్. అంతేకాని నాకు గుడి కట్టండి, నాకు పూజలు చేయండి, నాకు నమస్కారాలు చేయండి, నా మీద స్తోత్రాలు చదవండి అని ఏమి చెప్పలేదు. అతని యొక్క సమాధిని సిమెంటు చెయ్యమని చెప్పలేదు. అందరిని ఏ స్మశానానికి తీసుకు వెళ్లి దహనం చేస్తున్నారో, ఈ శరీరాన్ని తీసుకు వెళ్లి అక్కడే దహనం చేసేయ్, మన హృదయంలో ఎంతో దుఃఖం ఆర్పిన గౌతమ బుద్ధుడు మన దగ్గర నుంచి ఒక నమస్కారం కూడా ఆశించలేదు. రూపాన్ని పట్టుకుని పుట్టావు, రూపాన్ని పట్టుకుని పెరుగుతున్నావు. మరణించే రోజున కూడా ఆ రూపాన్ని స్మరిస్తూనే మరణిస్తున్నావు.

అహంకారం విడిచి పెట్టేవరకు, రూప ధ్యాస పోదు. రూప ధ్యానం పోదు. రూపాలు మనల్ని విడిచి పెట్టవు. రూపాన్ని స్మరిస్తూ, రూపాన్ని ధ్యానిస్తూ మరణిస్తాం. మనకు రూప ధ్యాస పోలేదు అది మన పూర్వీకులకి తెలుసు. అందుచేత గుడికట్టి అక్కడ పెట్టారు లింగాన్నిలింగం ఒక గుర్తు. దేవుడు ఉన్నాడు పరమాత్మ ఉన్నాడు అనే గుర్తు కోసం,ఆ లింగానికి చేతులు లేవు, నోరు లేదు, కాళ్ళు లేవు. నాలోని సత్య వస్తువుని నేను గ్రహించలేను. బయట రూపాలకి అలవాటు పడిపోయి ఉన్నాను కాబట్టి గుడి కట్టి భగవంతుడు ఒకడు ఉన్నాడు అని గుర్తు కోసం ఒక రూపాన్ని పెట్టారు. నాకు భక్తి ఉంది నాకు భక్తి ఉంది అని మనం అనుకుంటున్నాము అయితే మనకు మోక్షం ఎందుకు రావటం లేదు. అసలు తెలుసున్నదే చిన్న విషయం. తెలియని విషయాలు వదిలేయండి. మీకు తెలియని విషయాలు గురించి కాదు నేను అడిగేది. మీకు తెలుసున్న విషయాలు మీకు ఎంతవరకు తెలుసు. మీరు అందరూ మోక్షంలోనే ఉన్నారు. అది మీకు అనుభవంలోకి రావడానికి ఏది అడ్డు వస్తోంది? ఒక్కసారి చూసుకోండి. మాకు శాంతి లేదు, మాకు శాంతి లేదు అంటారు కొంతమంది, మీకు ఏది అడ్డు వస్తోంది. మంత్రాన్ని జపించు, మంత్రాన్ని జపించు అని అడుగుతారు. మంత్రం జపించమని ఎవరు అడుగుతున్నారు మిమ్మల్ని. నాకు మంత్రం చేయాలని ఉంటుంది ఓం నమో నారాయణాయ. అలా గంట చేయాలి. రెండు గంటలు చేయాలి అని అనుకుంటాను

కూర్చుంటాను ఆగిపోతాను. ఎవడొకడు ఉంటే కదా నారాయణ నారాయణ అని చెయ్యడానికి, చేసేవాడు ఎవడు?

భగవాన్ తల్లికి ఎన్ని మాటలు చెప్పినా ఎంత గోల చేసినా, ఎంత చెయ్యనివ్వండి వీడు నా కొడుకు అనే భావన ఆవిడకి పోలేదు. వీడు నా కొడుకు అనే భావనపోకపోతే ఆవిడకి మోక్షం వచ్చే అవకాశం లేదు. ఎవ్వరూ లేకుండా భగవాన్, తల్లి ఇద్దరూ కూర్చున్నారు. సడన్‌గా పెద్ద తాచుపాము వచ్చి భగవాన్ ఒళ్ళంతా చుట్టుకు పోయింది. ఆ తల్లి చూసి వీడు మా అబ్బాయి కాదు. ఆ పాముని తోలేయ్, ఆ పాముని తోలేయ్ నాకు భయం వేస్తుంది. ఆ పాముని తోలేయ్ అంటే ఆ దృశ్యం తల్లికి కనిపించేలా ఈయన చేస్తున్నాడు. ఆ దేహానికి పరిమితమైన బుద్ధిని పోగొట్టడం కోసం ఆ సంకుచిత బుద్ధిని, ఆ ఇరుకు బుద్ధిని పోగొట్టడం కోసం అటువంటి దృశ్యాలు అప్పుడప్పుడు చూపించేవాడు. తరువాత భగవాన్ వాళ్ళ అమ్మకి మోక్షం ఇచ్చాడు. వాళ్ళ అమ్మకే మోక్షం ఇస్తాడా? మిగతా వారు ఎవరి అమ్మలకి ఇవ్వడా? అనే వారు. రైటే, వాళ్ళ అమ్మ ఎంత కష్టపడిందో, ఎన్ని బాధలకు గురి అయ్యిందో, ఎంత ఏడుపు ఏడిచిందో, అంత కష్టం వీళ్ళ అందరు అమ్మలు పడ్డారా? భగవాన్ తల్లికి లేనటువంటి ఆధ్యాత్మిక ఔన్నత్యం అంటే ఆధ్యాత్మిక శిఖరం భగవాన్ తల్లి అందుకోలేదు, పళని స్వామి అందుకోలేదు, మురుగనార్ అందుకోలేదు, గణపతి శాస్త్రిగారు అందుకోలేదు. ఎవ్వరూ అందుకోలేదు ఆ శిఖరాన్ని ఎవరు పట్టుకున్నారు జీవించి ఉండగా, గోవు లక్ష్మి. లక్ష్మి ఎంత పరిశుద్ధం అయినది అంటే ఆ ప్రాణ ప్రయాణ టైములో అమ్మా లక్ష్మి ఎప్పుడో చిన్న దూడ అప్పుడు వచ్చావు నువ్వు ఇక్కడకి. వెళ్ళిపోతున్నావా లక్ష్మి, వెళ్ళిపోతావా అని ఆవు యొక్క మెడ కింద నుంచి ఎత్తి ఈయన ఒడిలో పెట్టుకున్నారు అటండి. భగవాన్ సహాయం చేసి లక్ష్మిలో పోగొట్టవలసిన వాసన ఒక్క వాసన లేదు అటండి. నా సహాయం వల్ల దానికి మోక్షం రాలేదు. సహజంగా వచ్చింది. ఆవు గురించి అలా చెప్పినటువంటి భగవాన్, గణపతి



**గురువు ఏదైనా ఒక మాట చెపితే, సూర్యుడు ఎంత దూరం వెలుగును ప్రసరిస్తాడో, గురువు మాటలు అంత దూరం ధ్వనిస్తాయి, ప్రతిధ్వనిస్తాయి.**

శాస్త్రి గారు శరీరం విడిచి పెట్టి వెళ్ళిపోతే గణపతి శాస్త్రి గారు ఇంత పండితుడు అంత పండితుడు అని చెప్పినటువంటి ఈ భగవాన్, ఎవరో అడిగారు అటండి ఏవండి గణపతి శాస్త్రి గారు మోక్షానికి వెళ్ళారా అని, ఆయన మహాత్ముడు, గొప్పవాడు అందులో సంశయం లేదు. మోక్షానికి వెళ్ళారా అని మీరు అడుగుతున్నారు అది ఎలా సాధ్యం?

జ్ఞానం సంపాదించాలి అనే ఆకాంక్ష కనుక ఉంటే ఈశ్వరుడి యొక్క కరుణ ఎప్పుడూ మీతో ఉంటుంది. జ్ఞానం సంపాదించాలి అనే కాంక్ష నిజమైతే ఈశ్వర అనుగ్రహం తప్పనిసరిగా మీ శిరస్సు మీద వాలుతుంది. హోమియోపతి కాకపోతే అల్లోపతి, అల్లోపతి కాకపోతే హోమియోపతి ఇవన్నీ వాడుతూ నూరుసంవత్సరాలు జీవిస్తాం అనుకోండి వంద సంవత్సరాలు జీవించిన తరువాత అయినా సరే శరీరం విడిచి పెట్టక తప్పదు. తరువాత మన కూడా వచ్చే సంపదని మనం ఆర్జించాలి. ఆ జ్ఞానాన్ని ఆర్జించాలి. మీలో ఎవరికి అయినా జ్ఞానం పొందాలి అనే కోరిక కలిగితే చాలు ఈ మీటింగ్ యొక్క ప్రయోజనం నెరవేరినట్టే. అసలు తెలుసుకోవాలనే కాంక్ష కలిగినా చాలు. మన అందరికి తెలియక పోవచ్చు. కానీ తెలుసుకోవాలి అనే కాంక్ష కలిగితే చాలు. ఆ కాంక్షే నిన్ను వెంటాడుతుంది. మోక్షం వస్తుందా రాదా అని మీరు ఎవ్వరు అనుమానం పెట్టుకోవద్దు, సందేహం పెట్టుకోవద్దు. ఎందుచేత అంటే మీకు ఎంతో కొంత మీకు తెలిసో, తెలియకో దైవీ సంపద మీలో లేకపోతే ఈ జ్ఞానానికి సంబంధించిన మాటలు వినాలనే కోరికే కలగదు. ఏ సంస్కారం అయితే మిమ్మల్ని ఇక్కడకు తీసుకు వచ్చిందో, అదే సంస్కారం మీకు మోక్షాన్ని ఇచ్చే వరకు మిమ్మల్ని విడిచి పెట్టదు. ఇది సదా జ్ఞాపకం ఉంచుకోండి. అంటే మీరు దేనికి భయపడవలసిన పని లేదు. ఎదుటి వాడిని చూసి కోపం తెచ్చుకోకండి, ఎదుటి వాడిని చూసి అసూయ తెచ్చుకోకండి, ఎదుటివాడిని చూసి భయపడకండి. ఎవరైతే భయపడుతున్నారో వాళ్లకి జ్ఞానం రాదని నేను చెప్పలేదు యమధర్మరాజు చెప్పాడు. ఎవడికైతే భయం వేస్తుందో వాళ్లకి జ్ఞానం రాదు. ధనవంతుడిని ఎవడినైన చూస్తే నాకు అసూయ కలుగుతోంది అనుకోండి అంటే దాని అర్థం ఏమిటి నాకు ధనం మీద కోరిక ఉంది. ధనం లేనివాడిని చూసి మనకు అసహ్యం కలుగుతోంది అనుకోండి అది కూడా మనకు డబ్బు మీద కోరిక. అంటే ఇవన్నీ ఎందులోంచి వస్తున్నాయి కోరిక లోంచే వస్తున్నాయి.

అందుచేత గౌతమబుద్ధుడు ఏమి చెప్పాడు అంటే ఇన్ని వివరాలలోకి ఆయన వెళ్ళకుండా కోరికని విడిచి పెట్టు, నీ కోరికే నీకు దుఃఖ కారణం, నీ కోరికే నీకు నరక కారణం. నీ కోరికే నీకు బాధ కారణం అన్నాడు. అందుచేత ఈ దుఃఖం నుండి బయట పడాలి అంటే కోరిక నుంచి బయట పడాలి. కొంచెం కూర్చోటానికి భగవంతుడికి చోటు ఇవ్వండి, ఆయన స్వరూపం మీకు ఇచ్చేవరకు మిమ్మల్ని విడిచి పెట్టడు. 1950లో భగవాన్ శరీరం విడిచి పెట్టేశారు. తరువాత 20 సంవత్సరాలు ఉండి వెళ్ళిపోతున్నాడు భగవాన్ లేని భారత దేశం నాకు ఎందుకు అని, ఇంతకాలం మీ దేశంలో ఉన్నాను, అరుణాచలం విడిచి పెట్టి వెళ్ళిపోతున్నాను, మళ్ళీ ఇంగ్లాండు వెళ్ళిపోతున్నాను అంటాడు చాడ్విక్. పూర్వజన్మ స్మృతుల వల్ల ఈ భారతభూమికి ఆయనకీ ఉన్న సంబంధం, భగవాన్‌తో ఆయనకి ఉన్న సంబంధం, ఈశ్వరుడికి ఆయనకీ ఉన్న సంబంధం కోత పెట్టింది ఆయన హృదయాన్ని. ఇంకో అరగంటలో విమానం బయలు దేరిపోతుంది అనగాఈ దేశాన్ని విడిచిపెట్టటానికి ఇష్టపడటం లేదు, ఎక్కడకి వెళ్తావు, ఎక్కడకి వెళ్తావు ఈ దేశాన్ని విడిచి పెట్టి అని హృదయంలో వేదన బయలు దేరింది. చిట్టచివరికి మళ్ళీ వెనక్కి వచ్చేశాడు అరుణాచలం. భగవాన్ చెప్పిన మాటలు నిజమా అబద్ధమా? ఏనాడో చెప్పాడు భగవాన్,చాడ్విక్ఇంగ్లాండు వాడు కాదు కొన్ని కారణాల వల్ల ఆ దేశంలో పుట్టాడు. ఆ కర్మానుభవం అయ్యిపోయింది. ఈ దేశం వచ్చాడు. వాడు మనవాడే. జ్ఞాని మాటకి తిరుగుండదు.

మీరు సంపాదించుకున్న ఈ భక్తి, మీరు సంపాదించుకున్న ఈ జ్ఞానమే మీకు గురువుగా మారి మీకున్న భక్తే మీకు గురువుగా మారి, మీకున్న వైరాగ్యమే మీకు గురువుగా మారి రక్త మాంసాలతోటి మళ్ళీ మీ దగ్గరకి వచ్చి మీకు మోక్షాన్ని ఇచ్చి తీరుతుంది. ఎక్కడో వైకుంఠం నుంచి వస్తాడు, కైలాసం నుంచి వస్తాడు అని మీరు చూడక్కర్లేదు. వైకుంఠం నుంచి వచ్చేవాడికి కొంచెం టైము పట్టచ్చు. మీ జ్ఞానమే, మీ భక్తే గురువుగా మారుతుంది. మీ వైరాగ్యమే మీ గురువుగా మారుతుంది. మీకున్న జ్ఞానం ఒక శరీరం తొడిగి వచ్చి మిమ్మల్ని అంతర్ముఖం చేస్తుంది. మీరు సంపాదించుకున్న భక్తి, మీరు సంపాదించుకున్న జ్ఞానం, మీ వైరాగ్యాన్ని భగవంతుడు తన బ్యాంకులో దాచి ఉంచుతాడు. ఎక్కడికీ పోదు. మీ శరీరాలు ఇక్కడ కరిగిపోవచ్చు, మీ శరీరాలు ఇక్కడ అరగిపోవచ్చు, మీ శరీరాలు ఇక్కడ కాలిపోవచ్చు,

మీ శరీరం ఉండగా మీరు సంపాదించినటువంటి మంచి మంచి సంస్కారాలని ఈశ్వరుడు జాగ్రత్త పెట్టి మీ కోసం ఉంచుతాడు. అంటే ప్రయత్నం చెయ్యండి, ప్రయత్నం చేస్తే మనకు ఫలితం వస్తుంది. ఈశ్వరుడిని ప్రేమించండి, ఈశ్వరుడిని సదా జ్ఞాపకం ఉంచుకోండి. ఈశ్వరుడిని మర్చిపోకండి. హృదయ పూర్వకంగా మీరు భగవంతుడిని ప్రేమించండి. భగవంతుడిని ఎవరు మర్చిపోకండి. ఇదంతా మీకు సొమ్ము అవుతుంది. నా మాటలు నమ్మండి. మీ కష్టం అంతా మీకు సొమ్ము అవుతుంది. దుమ్ము అవ్వదు సొమ్ము అవుతుంది.

**ఓం శంభో శివశివ శివశివ శివశివ**

**నారాయణ నారాయణ నారాయణ నారాయణ**

**ఓం శంభో శివశివ శివశివ శివశివ**

**నారాయణ నారాయణ నారాయణ నారాయణ**

**ఆటలు నీవే, పాటలు నీవే, మాటలు నీవే, అన్నీ నీవే అవునా భగవాన్**

**ఆటలు నీవే, పాటలు నీవే, మాటలు నీవే, అన్నీ నీవే అవునా భగవాన్**

**హే భగవాన్, జయ భగవాన్, ప్రియ భగవాన్, ప్రభు భగవాన్**

**హే భగవాన్, జయ భగవాన్, ప్రియ భగవాన్, ప్రభు భగవాన్**


**అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా**

**అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా**

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**, అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0916137)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# అరుణాచల మహత్మ్యం
# అక్షరమణమాల

**అడుగకిచ్చెడు నీదు అకళంకమగు కీర్తి।**

**హాని సేయక బ్రోవుమరుణాచలా! ॥ 22 ॥**

**తాత్పర్యము:** అడగకుండానే అన్నీ ఇచ్చే స్వామివని నీకు స్వచ్ఛమైన కీర్తి ఉంది! అట్టి నీ కీర్తికి మచ్చ రానీయక నన్ను రక్షించు అరుణాచలా!

నా హృదయంలో ఏదో సత్యం ఉంది అని చెపుతున్నారు. అది నాకు తెలియటం లేదు. అది తెలుసుకోవటానికి మీరు అనుగ్రహిస్తారా అని భగవాన్ ని అడిగితే, అనుగ్రహించమని సహాయం చెయ్యమని గురువును అడగవలసిన పని లేదు, అనుగ్రహం ఎప్పుడూ ఉండనే ఉంది అన్నారు.

భగవాన్ అక్షరమణమాలలో 'అడుగకిచ్చెడు నీదు అకళంకమగు కీర్తి హాని సేయక బ్రోవు మరుణాచలా' అన్నారు. అరుణాచలేశ్వరుడికి అడగకుండా ఇచ్చే గుణం ఉంది. దయ ఇచ్చినా ఏదైనా వస్తువు ఇచ్చినా ఇంకోటి ఇచ్చినా ఆయనని అడగవలసిన పని లేదు అడగకుండానే ఇస్తాడు అరుణాచలేశ్వరుడు.

అరుణాచలేశ్వరుడు శివుడు, దేవుడు చాలా గొప్పవాడు చాలా కీర్తిమంతుడు అని చెప్పుకొంటున్నారు లోకంలో అందరూ. పైగా ఇంకోటి చెప్పుకొంటున్నారు అరుణాచలేశ్వరుడిని ఏమీ అడగక్కరలేదు. అడగకుండా ఇచ్చే అలవాటు ఉంది అని కూడా నిన్ను స్తోత్రం చేస్తున్నారు. ఇప్పుడు నా విషయంలోనా చేత అడిగించుకొని కానీ నువ్వు ఇవ్వవు అనుకో, నాకు నష్టం లేదు, నీకు గౌరవానికి భంగం అని చెపుతున్నారు రమణ మహర్షి. 'అడుగకిచ్చెడు నీదు అకళంకమగు కీర్తి' - అడగకుండా ఇచ్చే స్వభావం కలవాడు అని నీకు కీర్తి గౌరవం ఉంది.

అందుచేత నీ కీర్తికే హాని నాకేమీ హాని లేదు. నాకేమిటి, నాకు పోయేది ఏమీ లేదు. నాకు కీర్తి ఉంటే కదా పోవటానికి అన్నారు భగవాన్. నాకు ఇవ్వవు అనుకో నీ గౌరవమే పోతుంది. నీ స్పిరిట్యువల్ స్టేటస్‌కి నష్టం, నాకేమీ లేదు.

ఒక వేళ నాకు ఏదైనా అవసరాలు ఉన్నాయి అనుకో, నా చేత అడిగించుకోకుండా ఇవ్వు. బుద్ధుడి దగ్గర ఆయన చవితి తమ్ముడు ఉండేవాడు. ఆయన పేరు ఆనంద్. బుద్ధుడికి మంచినీళ్లు కావాలి అంటే నాకు మంచినీళ్లు కావాలి అని ఆనందుని అడగక్కరలేదు. బుద్ధుడికి మంచినీళ్లు అవసరము అని వీడికి తెలిసిపోయేది. అది ఎక్స్ట్రీమ్ లవ్, లిమిట్లెస్! (గాఢమైన ప్రేమ, హద్దులు లేని ప్రేమ!) మీకు దాహం వేసినప్పుడు మీకు తెలుస్తుంది. అలాగే బుద్ధుడి శరీరానికి దాహం వేసినప్పుడు వీడికి తెలిసిపోయేది. మనుషులు ఇద్దరుగా కనిపిస్తున్నారు, కాని శరీరం ఒకటిగానే ఉండేది.

భగవంతుడు మనకి ఉన్న అవసరాలు తీర్చగలడు కాని ఎవరి ఆశని తీర్చలేడు. అరుణాచలేశ్వరుడికి ఎవరూ ఏమీ అడగకుండా వాళ్ళకి ఏది అవసరము అయితే అదే ఇస్తూ ఉంటాడు అనే కీర్తి ఉంది. అందుచేత మా అవసరాలు ఏమిటో నువ్వు తీరుస్తున్నావు. ఇది కావాలి అని నేను అడగను. ఏంచేతంటే నాకు ఏది అవసరమో నాకంటే నీకు ఎక్కువ బాగా తెలుసు. నాకు ఏది మంచో నాకంటే ఎక్కువ నీకు బాగా తెలుసు. ఏ పని చేయటం వల్ల నాకు జ్ఞానం కలుగుతుందో, అది నాకంటే నీకు బాగా తెలుసు. అందుచేత నా శరీరాన్ని ఒక పని ముట్టుగా నీ చేతిలో పెడుతున్నాను. దీనిని నువ్వు ఎలా వాడుకుంటే అలా వాడుకో. కాని అరుణాచలేశ్వరుడా నాకు ఫలానాది కావాలి అని నిన్ను అడగను. అడగవలసిన పని లేదు కూడా.

అందుచేత నా అవసరాలు ఏమిటో నాచేత అడిగించుకోకు. అరుణాచలేశ్వరుడా నా అవసరాలు ఏమిటో నీకు తెలుస్తూ ఉంటుంది కదా. ఎవరి అవసరాలు ఏమిటో నీకు బాగా తెలుసు. మాకు ఏది మంచిదో మాకంటే నీకే బాగా తెలుసు. అది నిజమే. కాని మాకు తెలియక కోరుకుంటాము. మనకి ఏది మంచిదో మన కంటే ఎక్కువ భగవంతుడికి తెలుసు, అన్న సంగతి మనకి తెలియాలి కదా. అది తెలిసిన వాళ్ళు ధన్యులు.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ లోకమాన్య బాలగంగాధర్ తిలక్ గారికి భగవద్గీతలో ఇది బాగా ఇష్టమైన శ్లోకం. ఇది భగవద్గీతలో రెండవ అధ్యాయములో వస్తుంది. తిలక్ గారిలో ఎక్కడా పిరికితనం కనబడదు. ఆయన గొప్ప వీరుడు. ఆకాశం వచ్చి నా మీద పడితే, ఆకాశాన్ని కిందపడేసి నా కాళ్ళ కింద తొక్కి నా పని నేను చేస్తాను అన్నాడు, వాడు తిలక్.కృష్ణుడు చెప్పిన తత్త్వం ఆయనలో ఉంది. ఈ శ్లోకం అంటే ఆయనకు బాగా ఇష్టం. ఇది ఆయన రక్తంలో జీర్ణం చేసుకొన్నారు. ఇంక రాత్రిపగలు ఇదే ఆయనకు మంత్రం.

**కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన ।**

**మా కర్మఫలహేతుర్భూమాతే సంగోస్త్వకర్మణి ॥2-47॥**

తాత్పర్యము: కర్తవ్య కర్మమునాచరించుట యందే నీకు అధికారము కలదు. ఎన్నటికీ దాని ఫలములయందు నీకు అధికారం లేదు. కర్మఫలమునకు నీవు హేతువు కారాదు. కర్మలను మానుటయందు నీవు ఆసక్తుడవు కావలదు. అనగా ఫలాపేక్ష రహితుడవై కర్తవ్యబుద్ధితో కర్మలను ఆచరింపుము.

ఈ శ్లోకం మీద కర్మయోగం అంతా ఆధారపడి ఉంది. ఈ శ్లోకం మీరు అర్థం చేసుకొని, ఆచరించి, అనుభవంలోకి తెచ్చుకుంటే, ఈ జన్మలోనే మీకు మోక్షం వస్తుంది అని లోకమాన్య తిలక్ చెప్పారు. ఈ శ్లోకంలో భగవంతుడు నాలుగు విషయాలు చెప్పాడు. మొదటిది కర్మ చెయ్యటానికే నీకు అధికారం ఉంది. రెండవది కర్మ ఫలితాన్ని నీవు

ఆశించవద్దు. మూడవది ఈ పని చేయటం వలన నాకు ఈ ఫలితం వచ్చింది అని కర్మఫలానికి హేతువు కావద్దు. నాల్గవది భగవంతుడు కర్మ ఫలితాన్ని ఆశించవద్దు అని చెపుతున్నాడు కదా అని మొత్తం కర్మ చేయటం మానివేయవద్దు. అర్జునా అకర్మ పట్ల ఆసక్తి పెట్టుకోవద్దు అని చెపుతున్నాడు. అకర్మ పట్ల ఆసక్తి పెట్టుకొంటే నీకు దేహయాత్ర కూడా కష్టమవుతుంది. దేహపోషణకు ఇతరుల మీద ఆధారపడితే బానిసత్వ బుద్ధి వస్తుంది. నీవు పని చెయ్యి, పని యందు విరక్తి పెట్టుకోవద్దు. పని వలన వచ్చే ఫలితానికి కారణం అవ్వవద్దు. కర్మఫలాన్ని ఆశించవద్దు. కర్మని విడిచిపెట్టవద్దు. కర్మ చెయ్యి, ఫలితాన్ని ఆశించవద్దు. కర్మఫలితాన్ని ఆశించకుండా ఉంటే ఫలితం వస్తుంది, మోక్షం కూడా వస్తుంది.

నువ్వు పని చేయటానికే పనికి వస్తావు. పని విడిచిపెట్టవద్దు. ఇతరులు గుర్తించినా, గుర్తించకపోయినా, నువ్వు చేసే పని భగవంతుడు చూస్తున్నాడు కదా. నీకు మోక్షం ఇచ్చేది భగవంతుడే కదా. ఇతరులు నిన్ను మెచ్చుకొన్నా, నిన్ను విమర్శించినా వారి అహంకారమే కదా. ఇతరుల అహంకారం మీద ఆధారపడి ఎంతకాలం బతుకుతావు. కర్మ ఫలితం మీద నీకు అధికారం లేదు. దాని మీద అధికారం భగవంతుడిది. ఇతరులు మెచ్చుకోవటం లేదు అని నువ్వు చేసే పని మానకు. నువ్వేదో మంచి పని చేసావని అందరూ సంతోషిస్తారు అనుకోకు. మంచిపనులు చేసినా నిన్ను తిట్టేవారు ఉంటారు. గోడలో అడుగున ఉన్న ఇటుకలు కనబడవు. అలాగే ఈ జన్మకు బేస్మెంట్ పూర్వజన్మలు. ఈ పూర్వజన్మలు మనకు కనబడవు. ఆ సంఘటన అలా ఎందుకు జరిగింది, ఈ సంఘటన ఇలా ఎందుకు జరిగింది, అని మనం అనుకుంటాము. పూర్వజన్మలకు దీనికి సంబంధం ఉంటుంది. ఈ జన్మలో కారణం కనబడకపోవచ్చు. పూర్వజన్మలలో మనం చేసిన పనులకు ఫలితం భగవంతుడు ఎప్పుడు ఎలా ఇస్తాడో మనం చెప్పలేము. ఫలితం నీ చేతిలో లేదు. ఈ శ్లోకం అర్థం అయితే మీకు ఇంక దుఖం రాదు.

కర్మఫలానికి నువ్వు కారణం కావద్దు. కర్మఫలానికి నువ్వు కారణం అనుకొంటే నీ కూడా దుఖం వచ్చేస్తుంది. పని చేసి మరిచిపో. ఈ పని ఇలా అవుతుంది అనుకోలేదు అనుకున్నా, అది నీ చేతిలో లేదు. నీ చేతిలో లేనిదానికి నువ్వు కారణం అనుకుంటే దుఃఖం రాక ఏమి చేస్తుంది. కళ్ళు లేని వాడికి కళ్ళు ఇచ్చాడు ఏసు. తరువాత వాడు శుభ్రంగా పాడైపోయాడు. ఏమిటి ఇలా పాడైపోయావు అంటే దానికి మీరే కారణం అన్నాడు. నాకు కళ్ళు లేనప్పుడు ఒక ప్రక్కన పడి ఉన్నాను. మీరు కళ్ళు ఇచ్చాక ఈ లోకంలో ఇన్ని భోగాలు

ఉన్నాయి అని తెలిసింది. వాటిని అనుభవించి శుభ్రంగా కుళ్లిపోయాను. మీరు కళ్ళు ఇవ్వటం వలన ఇదంతా జరిగింది. నేను పాడవ్వటానికి మీరే కారణం అన్నాడు. ఆయన మంచికే ఇచ్చాడు, వాడు పాడైపోతే ఏసు ఏమి చేస్తాడు. వాడి పతనానికి నేనే కారణం అని ఏసు అనుకుంటే ఆయనకీ దుఖం వస్తుంది. ఏసు అలా అనుకోలేదు, మన డ్యూటీ మనం చేసాము అనుకున్నాడు. కర్మఫలానికి మీరు కారణం అనుకున్నంతకాలం మీకు వెయ్యి కోట్లు ఉన్నా దుఖం మిమ్మల్ని వెంటాడుతుంది. కర్మ ఫలితం భగవంతుడి చేతిలో ఉంది. ఆయన చేతిలో ఉన్న పని గురించి ఆలోచించకు, దాని గురించి ఆలోచించటం వలన నీకు ప్రయోజనం లేదు, ఆయన జడ్జిమెంట్ నువ్వు అంగీకరించవలసిందే.

శాంతి లేనివాడికి సుఖం లేదు. మనం దారిద్ర్యం అనుభవించగలం కాని మానసికంగా అశాంతి అనుభవించలేము. నువ్వు చేసే మంచి పనులు ఎవరూ గుర్తించటం లేదు, సన్మానాలు చేయటం లేదు అని అసలు పని యందే విరక్తి పెట్టుకోవద్దు. గుర్తింపులు రావటం లేదు అని మీ చేతిలో ఉన్న పని మానేస్తే మీదే దోషం. గుర్తింపులు కోరుకోవటం వలన అహంకారం పెరుగుతుంది. మనల్ని ఎవరూ గుర్తించకపోవటం మంచిది. ఎందుచేతనంటే మనం శాంతిగా ఉండవచ్చు. నీ మనస్సు ఎటు గంతులు వేయమంటే అటు గంతులు వేయకు. నీ మనస్సు కోతి లాంటిది. ఒక రోజు పెట్టమంటుంది, యింకోరోజు కొట్టమంటుంది. అది నిజం కాదు. దేవుడు చెప్పిన వాక్యానికి అనుగుణంగా ప్రవర్తిస్తున్నామా లేదా అనేది చూసుకోవాలి. మనస్సు ఎలా చెపితే అలా ప్రవర్తించకూడదు. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించు, ధర్మాన్ని ఆచరించు, అదే నిన్ను రక్షిస్తుంది. స్వార్థం లేకుండా నువ్వు చిన్న మంచి పని చేసినా అది నిన్ను రక్షిస్తుంది.

కృష్ణుడు గీతలో ఏమని చెప్పాడు అంటే, మీకు తోచినట్లు చేయటం కర్మ కాదు, అది ఖర్మ అవుతుంది. భగవంతుడి మాటలను ప్రమాణంగా పెట్టుకొని పని చేస్తే అది కర్మ అవుతుంది. మీకు ఇష్టమైనట్లు చేస్తే అది ఖర్మ అవుతుంది. కర్మ వేరు, ఖర్మ వేరు, అని భగవంతుడు చెపుతున్నాడు. మీరు ఏ రకంగా పని చేస్తే మీకు శాంతి కలుగుతుందో, మోక్షం కలుగుతుందో, ఆ రకంగా పని చేస్తే అది కర్మ. కొంత స్వార్థం తగ్గించుకొని పని చేసినా మీకు భక్తి కలుగుతుంది. భక్తి వలన జ్ఞానం కలుగుతుంది. జ్ఞానం వలన భగవంతుని స్వరూపమును పొందుతారు.



గురువు శరీరం కూడా ఆనందవేు. ఆయన శరీరాన్ని చూస్తూ ఉంటే మనకు ఆనందం కలుగుతుంది. ఖర్మ అనుభవించటానికి గురువు శరీరం రాలేదు. ఖర్మ జీవుడు అనుభవిస్తాడు కానీ ఆత్మ అనుభవించదు. భక్తుడి మీద ఉండే ప్రేమ కొలదీ ఆ భక్తుడిని అనుగ్రహించటానికి, గురువు ఆనందంతో శరీరం ధరిస్తాడు. ఆనందంలో నాని నాని, ఉబికి ఉబికి, శిష్యుడిని ఉద్ధరించటానికి, ఆనంద తాండవంలో, ఆనంద ప్రవాహంలో శరీరం ధరించాడు. కాబట్టి గురువు శరీరం కూడా ఆనందమే. ఆత్మే ఆ రూపం ధరించింది కాబట్టి గురువు శరీరం కూడా ఆనందమే. అందుచేత ఆయనను చూసేటప్పటికి మనకు కూడా ఆనందం కలుగుతుంది. Look at him you feel it. ఆత్మలో ఆనందం ఉంది అని ఇప్పటివరకు చెపుతున్నాము కానీ ఇప్పుడు గురువు శరీరం కూడా ఆనందమే అంటున్నాము. గురువు యొక్క శరీరం ఆనందంలో వచ్చింది, ఆనందంలో ఉంది, మరల ఆనందంలోనే ఆ శరీరం అదృశ్యం అవుతుంది. మనలను దుఃఖ పెట్టటానికి గురువు రాలేదు, మనకు ఆనందం పంచిపెట్టటానికే వచ్చాడు. ఆనందాన్ని శాంతిని జ్ఞానాన్ని మనతో పంచుకోవటానికి గురువు వచ్చాడు. అందుచేత ఆయన శరీరం కూడా ఆనందమే, ఆయన శరీరం కూడా శాంతే, ఆయన శరీరం కూడా చైతన్యమే.

# గురువు మాత్రమే పూర్ణ పురుషుడు

ప్రపంచం ఒక రంగస్థలం. తమ తమ కర్మానుసారంగా ఒకరు భర్తగాను, ఒకరు స్త్రీగా భార్యగాను, మిత్రులుగాను, తోబుట్టువులుగాను నటిస్తూ ఉంటారు. ఇది అంతా స్వార్థపూరితమైన సంగతి అని మర్చిపోతాము. మనం వాళ్లను మనవారిగా చేసుకొనే ప్రయత్నంలో మునిగిపోతాము. దానితో వారి పట్ల మమకారం జనిస్తుంది. అది దేహ బంధనాల వైపుకు లాక్కొనిపోతుంది. చివరకు వారు సహాయపడరు. ఇది కాలుని పంజరం. దీనిలో 70 లేదా 80 సం॥లు ఉంటాము. తరువాత ఈ శరీరాన్ని వదలిపోతాము. వాళ్ళు ఎవరూ మన భక్తికి, ప్రేమకు యోగ్యులు కారు. చావు ఎవరికోసమో అనుకొంటాము. ఇది జన్మ చక్రం. ఇందులోనుండి బయటపడేసేది గురువు మాత్రమే. కబీర్ "విషయ వాసనలలో పడి జన్మను వ్యర్థం చేసుకొంటున్నావు. ఇప్పుడు పూర్వకర్మలను గుర్తుచేసుకొని పశ్చాత్తాప పడితే ఏమి ఉపయోగం? ఇప్పుడు ఏం చెయ్యాలో దాని గురించి ఆలోచించు" అన్నారు. శ్రీనాన్నగారు "గురు సహాయం లేకుండా నీవు చిన్న వాసనలోంచి కూడా బయటపడలేవు. నీ సాధనా ఫలితం ఏమిటి అంటే రూపం లేని పరమాత్మ రూపం కల్పించుకొని నీ దగ్గరకు వచ్చి బోధ చేసిన ఆ వస్తువు ఎక్కడ ఉందో అక్కడికి నీ దృష్టి మరలించి నీకు స్వస్వరూప సుఖాన్ని చూపెడతాడు" అన్నారు. ప్రేమ కామం కన్నా ఉన్నతమైనది, ఒక రోజు కామం గురు సన్నిధిలో మాయమౌతుంది. కామాన్ని అణిచిపెట్టుకొంటే అది మరో మార్గంపైకి వస్తుంది. వాసనాక్షయం అవ్వాలి. స్వార్థపరుడు సాధకునిని పూర్తిగా వాడుకొని బలి పశువుని చేస్తాడు. దీనినే నీతిహీనుని దగ్గరకు నిర్భాగ్యులు చేరుతారు" అంటారు. గురువుకు విశ్వాసపాత్రులు అయిన క్షణం మనం ఉంటాము మన వ్యక్తిత్వం సమస్తం తుడిచిపెట్టుకుపోతుంది. మనస్సులో వెయ్యినొక్క విషయాలు మొదలుపెడతాయి, భయం, దుర్బుద్ధి, ఆకర్షణ, అపరిమితమైన వాంఛలు, అయోమయం, గందరగోళాన్ని సృష్టిస్తుంది. అది నిశ్శబ్దంగా ఉన్న ఒక కొలనులో ఎవరో రాయి విసిరితే వేలాది అలలు ఎగిసిపడతాయి. దాని చేష్టలు గురు సన్నిధిలో నిలవవు. గురు సన్నిధిలో మన అంతరంగంలో వారి ప్రేమ కురుస్తుంది. అది కూడా ఆయన ఇస్తానని చెప్పడు, చెప్పటం కుదరదు, పూలపైన, పక్షులపైన, జంతువులపైన సూర్యకిరణాలు పడినట్లే గురువు సమీపంలో ఎవరు వచ్చినా ప్రేమే కురిపిస్తారు. గురువు దగ్గ ఉన్నది ప్రేమే, మరొకటి లేనే లేదు. శ్రీనాన్నగారి గురించి చెప్పాలంటే ఆయన పూర్ణ పురుషుడు, జీవిత మూలాన్ని తెలుసుకొన్న ధన్యులు. వారి జీవితం అందమైనది, ఆనందమయమైనది. ఆందోళనలు, పరితాపాలు ఆమడ దూరంలోనే ఉండిపోతాయి. వారు అందరినీ ప్రేమించారు. వారు చెయ్యాలనుకొన్నది భగవాన్ అనుగ్రహంతో అంతా చేశారు, చెప్పాలనుకున్నది అంతా చెప్పారు. మృత్యువును కూడా ఆనందంగా చూశారు. ఆయన శపథం "తుది శ్వాస వరకూ చైతన్యం గురించే చెబుతూ ఉన్నారు, బుద్ధుని భావనే అది. చివరి మాట - ఉండండి కేవలం మరి నిరీక్షించండి, సహనంగా ఉండండి".

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**